PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 98 | విజయవాడ, బుధవారం 9 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 9 November 2022 | Rs

ప్రధాని పర్యటన పేరిట దుకాణాల కూల్చివేత

- రోడ్డున పడ్డ వంద కుటుంబాలు
- న్యాయ పోరాటానికి సిద్ధమైన బాధితులు
- కూల్చివేత దారుణం : సిపిఎం, టిడిపి

లోపలి పేజీలో..



టి20కప్‌లో నేడు తొలి సెమీఫైనల్

- ఫైనల్ బెర్త్ కోసం కివీస్‌తో పాక్ పోరు

లోపలి పేజీలో..

గ్రహణ వేళ చంద్ర కళలు




బెంగళూరులోని జవహర్‌లాల్ నెహ్రూ ఖగోళ విజ్ఞాన కేంద్రంలో గ్రహణాన్ని వీక్షిస్తున్న ప్రజలు



విశాఖలో..



విజయవాడలో



వాషింగ్టన్‌లో..



పాట్నాలో..



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)లో



విశాఖలో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 లోగోను ఆవిష్కరిస్తున్న సిఎం జగన్

దేశానికి గేట్‌వేగా ఎపి

- పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
- గ్లోబల్ ఇన్వెస్టర్ల సమ్మిట్ లోగో ఆవిష్కరించిన సిఎం జగన్


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశ వ్యాప్తంగా పారిశ్రామిక అభివృద్ధికి, ఎగుమతులకు తూర్పుతీరాన గేట్‌వేగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందనిరాష్ట్ర పరిశ్రమలు, పెట్టుబడులు, ఐటి శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. విశాఖపట్టణంలో మార్చి 3,4 తేదీల్లో జరుగనున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023 లోగోను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మంగళవారం ఆవిష్కరించారు. క్యాంపు కార్యాలయంలో ఈ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం మీడియా ప్రతినిధులకు సచివాలయంలో సమ్మిట్‌కు సంబంధించిన వివిధ అంశాలను మంత్రి అమర్‌నాథ్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోర్టులను పెద్ద ఎత్తున అభివృద్ధి పరుస్తోందని చెప్పారు. దీని ద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో రాష్ట్రం కీలకపాత్ర పోషించనుందని అన్నారు. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులకు ఆకర్షించేందుకు గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ గురించి పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. దేశంలోని ప్రముఖ మిగతా 2లో

గుజరాత్, హిమాచల్ ఎన్నికలకు

కార్పొరేట్ నిధుల వరద

- ఎలక్టొరల్ బాండ్స్ నిబంధనలు సవరించిన కేంద్రం



న్యూఢిల్లీ : త్వరలో జరగనున్న గుజరాత్, హిమాచల్ ఎన్నికల్లో గెలుపుకోసం బిజెపి అడ్డదారులు తొక్కుతోంది. కేంద్రంలో ఉన్న అధికారాన్ని అడ్డుపెట్టుకుని నిబంధనలను ఇష్టం వచ్చినట్లు మారుస్తోంది. ఎలక్టోరల్ బాండ్స్ చట్టబద్ధతపై సుప్రీంకోర్టు ఒకవైపు విచారణ చేస్తోంది. మరోవైపు ఎన్నికల నిబంధనావళి అమలులో ఉంది. అయినా, ఎలక్టొరల్ బాండ్ల రూపంలో కార్పొరేట్ నిధుల ప్రవాహానికి కేంద్ర ప్రభుత్వం గేట్లు ఎత్తివేసింది. ఈ మేరకు నవంబర్ నెలలో కూడా బాండ్ల అమ్మకానికి అనుమతి ఇస్తూ గుట్టుచప్పుడు కాకుండా సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపేలా మోడీ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మంగళవారం వెలుగులోకి రావడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి. 2018లో ఎలక్టొరల్ బాండ్స్‌ను ప్రవేశపెడుతూ జారీ చేసిన నిబంధనల ప్రకారం ప్రస్తుతం వాటి విక్రయానికి వీలులేదు. ప్రతి ఏటా జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో ప్రతి నెల పదిరోజులు ఎలక్టోరల్ బాండ్లను విక్రయిస్తారు. సాధారణ ఎన్నికలు జరిగే సంవత్సరంలో అదనంగా మరో 30 రోజులు బాండ్ల అమ్మకానికి అవకాశం ఉంది. వీటిని కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేసి తమకు నచ్చిన రాజకీయపార్టీకి విరాళంగా ఇయ్యవచ్చు.

తాజా సవరణ ఏమిటి?

గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల అసెంబ్లీ ఎన్నికలకు ఇటీవల నగారా మోగినప్పటికీ ఎలక్టొరల్ బాండ్స్ నిబంధనలు కార్పొరేట్ సంస్థల నుండి విరాళాల సేకరణకు ఆటంకంగా మారాయి. ఆ నిబంధనల ప్రకారం జనవరిదాకా కార్పొరేట్ సంస్థల నుండి కొత్తగా విరాళాలు తీసుకోవడానికి మిగతా 5లో

అవినీతికి చట్టబద్ధతే : ఏచూరి

ఎలక్టొరల్ బాండ్స్‌కు అనుమతించడం రాజకీయ అవినీతికి చట్టబద్ధత కల్పించడమేనని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఈ మేరకు చేసిన ట్వీట్‌లో ఎలక్టోరల్ బాండ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వీటి రాజ్యాంగ బద్ధతపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు డిసెంబర్‌ఆరున విచారించనుందని ఆయన తెలిపారు. ఈ పరిస్థితుల్లో కొత్తగా విక్రయాలకు ఎలా అనుమతిస్తారని ఆయన ప్రశ్నించారు.

కోడ్ ఉల్లంఘనే : ఎడిఆర్

ఎన్నికల వేళ ఎలక్టొరల్ బాండ్స్‌కు అనుమతించడం ఎలక్షన్‌కోడ్‌ను ఉల్లంఘించడమేనని ఎలక్టొలర్ వాచ్‌డాగ్ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ జగదీప్ ఎస్ చొక్కార్ పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో గేట్లు పూర్తిగా ఎత్తివేసినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు.

దిగ్భ్రాంతి కలిగిస్తోంది : లోకేష్ భత్ర

సుప్రీంకోర్టులో విచారణలో ఉండగానే కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం దిగ్భ్రాంతి కలిగిస్తోందని సమాచార హక్కు కార్యకర్త లోకేష్ భత్ర పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో దాదాపుగా సంవత్సరం మొత్తం కార్పొరేట్ నిధులు పార్టీలకు అందుబాటులో ఉంచినట్టైందని తెలిపారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపండి

- వాల్తేరు రైల్వే డివిజన్ తరలింపు తగదు
- రాష్ట్ర పునర్విభజన చట్టం హామీలు, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ అమలు చేయాల్సి
- ప్రధాని మోడీ విశాఖ పర్యటన నేపథ్యంలో బిజెపియేతర పార్టీల తీర్మానం



రాజకీయ తీర్మానం సందర్భంగా చేతులెత్తి అభివాదం చేస్తున్న బిజెపియేతర రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ, వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఒడిశాకు తరలింపు నిర్ణయాలను వెనక్కు తీసుకోవాలని, 2014 ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని అమలు చేయాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ హామీని నెరవేర్చాలని బిజెపియేతర పార్టీలు డిమాండ్ చేశాయి. పోలవరం ప్రాజెక్టుకు నిధులు పెంచాలని, దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఫంక్షనింగ్ ఏ తేదీ నుంచి జరుపుతారో తెలియజేయాలని కోరాయి. విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ పైవిషయాలపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ ఏకగ్రీవంగా రాజకీయ తీర్మానం చేశాయి. బిజెపియేతర రాజకీయ పార్టీల సమావేశం మంగళవారం విశాఖ మద్దిలపాలెంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) జిల్లా కార్యదర్శి వై.కొండయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, టిడిపి జిల్లా కార్యదర్శి ఎండి.నజీర్, ఆప్ రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీతాల్, లోక్‌సత్తా నగర అధ్యక్షులు వి.హరిగణేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.సుధాకర్, ఎంసిపిఐ జిల్లా కార్యదర్శి కె.శంకరరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఈ నెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని, 8,500 మంది నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత తీసుకొని ప్రధానితో ఉక్కుపైనా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలపైనా ప్రకటనలు చేయించాలని కోరారు. ప్రధాని వద్దకు అఖిలపక్ష పార్టీల ప్రతినిధుల బృందాన్ని తీసుకెళ్లాలని మిగతా 2లో

53 మంది డిఎస్‌పిల బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా డిఎస్‌పిల బదిలీలను ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టింది. ఈ మేరకు సోమవారం డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం మీద 53మందికి బదిలీలు జరిగాయి. వీరిలో అనేకమంది పోస్టింగ్ కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వారు కూడా ఉన్నారు.

పెట్టుబడిదారి దేశాలే నష్టపరిహారం ఇవ్వాలి

- పర్యావరణ విధ్వంసానికి వాటిదే బాధ్యత
- కాప్ సదస్సులో పేద దేశాల డిమాండ్

లోపలి పేజీలో..

ఎంఎల్‌సి ఎన్నికల్లో అక్రమాలు అరికట్టేందుకు

జిల్లాకో ఐఎఎస్‌ను నియమించాలి

- కృష్ణపట్నం థర్మల్ ప్రాజెక్టు టెండర్లు రద్దు చేయండి : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రంలో జరుగుతున్న శాసనమండలి ఎన్నికల్లో ఓట్ల నమోదుకు సంబంధించి అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ దృష్ట్యా ప్రతి ఓటునూ పరిశీలించాలని, అందుకోసం ప్రతి జిల్లాకూ ప్రత్యేక ఐఎఎస్ అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓట్లు నమోదులో అధికార పార్టీ ఎన్నికల పద్ధతిని తారుమారు చేసిందని విమర్శించారు. అధికార పార్టీ నేతలు చెప్పినట్టు చేయలేదని తూర్పురాయలసీమ నియోజకవర్గం పరిధిలోని నెల్లూరు, అనంతపురం డిఇఒలను బదిలీ చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. నెల్లూరు డిఇఒగా గుంటూరు ఆర్‌జెడిని ఇన్‌ఛార్జిగా నియమించాలని, ఆయన అధికార పార్టీకి తొత్తులా పనిచేస్తున్నారని శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం రాత్రి 6.30 గంటల ప్రాంతంలో వైసిపి అభ్యర్థి బంధువుల అపార్ట్‌మెంట్‌లో ఆర్‌జెడి కూర్చొని ఎమ్మెల్సీ ఓట్ల నమోదులో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. అధికార పార్టీ కనుసైగల్లో పనిచేస్తున్నారని, ఇది ఎన్నికల నిబంధనావళికి విఘాతం కల్పించడమేనని తెలిపారు. ఆర్‌జెడిని అడ్డం పెట్టుకొని వైసిపి వారు ప్రైవేటు పాఠశాలల నుంచి ఓట్లు చేర్పిస్తున్నారని చెప్పారు. ప్రయివేటు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం దీనిపై స్పందించకపోతే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. గ్రాడ్యుయేట్ ఓట్లకు సంబంధించి నకిలీ ఓట్లు నమోదు చేశారని, 90 శాతం ఆన్‌లైన్‌లో ఓట్లు చేర్చారని తెలిపారు. నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి ఆన్‌లైన్ చేశారని విమర్శించారు. ప్రతి జిల్లాకూ ప్రత్యేక ఐఎఎస్ అధికారిని నియమించి ప్రతి ఓటునూ స్క్రూట్నీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేట్, టీచరు ఓటర్లు అధికార పార్టీ అక్రమాలను ఎదుర్కోవాలని కోరారు. కృష్ణపట్నం జెన్‌కోను ప్రైవేటీకరించాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమానికి 300 రోజులు కావస్తోన్నా ప్రభుత్వం వెనక్కి తగ్గకపోవడం శోచనీయమన్నారు. ప్రైవేటీకరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన టెండర్ల ప్రక్రియను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 11న విశాఖకు ప్రధాని నరేంద్ర మోడీ వస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం మిగతా 2లో

ఒఎంసి కేసులో శ్రీలక్ష్మి నిర్దోషి

- సిబిఐ అభియోగాలు కొట్టివేసిన హైకోర్టు



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఓబులాపురం మైనింగ్ కేసు (ఒఎంసి)లో సీనియర్ ఐఎఎస్ అధికారి శ్రీలక్ష్మిని న్యాయస్థానం నిర్దోషిగా తేల్చింది. అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆమెపై సిబిఐ మోపిన అభియోగాలను తెలంగాణ హైకోర్టు మంగళవారం కొట్టివేసింది. 2007 నుంచి 2009 వరకు పరిశ్రమల శాఖ కార్యదర్శిగా శ్రీలక్ష్మి ఉన్న సమయంలో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి అనంతపురం జిల్లాలో గనుల కేటాయింపు జిఒ, నోటిఫికేషన్‌లో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు సిబిఐ ఆరోపిస్తూ ఆమెపై కేసు పెట్టింది. సిబిఐ కోర్టులో 2012 మార్చిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. తనపై నమోదు చేసిన అభియోగాలను కొట్టేయాలని కోరుతూ శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్ కొట్టివేసేందుకు సిబిఐ కోర్టు నిరాకరించింది. దీంతో, తెలంగాణ హైకోర్టులో ఆమె పిటిషన్ దాఖలు చేశారు. ఒఎంసి కేసులో శ్రీలక్ష్మిపై అభియోగాలను కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

సంస్కరణలతో

ప్రభుత్వంపై వ్యతిరేకత

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

సంస్కరణల అమలుతో వైసిపి ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని రాష్ట్ర రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పిఎన్ కాలనీలో మంగళవారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న కొన్ని కార్యక్రమాల పట్ల వ్యతిరేకత ఉందని తెలిపారు. సంస్కరణలను ప్రజలు అర్థం చేసుకోకపోవడమే ఇందుకు కారణమని వారిని నిందించారు. మూడు రాజధానులని కొందరు హేళన చేస్తున్నారని, ప్రధాన రాజధాని విశాఖ నుంచే పాలన సాగనుందని అన్నారు. హైకోర్టు పనులుంటే కర్నూలు వెళ్తారని, హైకోర్టుకు వెళ్లాల్సిన అవసరం 0.01 శాతం మంది కూడా ఉండరని పేర్కొన్నారు. ఏడాదికి మూడు పర్యాయాలు చట్టసభల సమావేశాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు అమరావతి వెళ్తారన్నారు. రాజధానులు ఒకచోట, హైకోర్టు మరోచోట ఉన్న రాష్ట్రాలు దేశంలో ఎనిమిది ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖకు రైల్వే జోన్ వస్తుందని, రోడ్డు కనెక్టివిటీ, పోర్టు, ఎయిర్‌పోర్టు సౌకర్యాలు ఉన్నాయని, 500 ఎకరాల్లో రాజధానిని నిర్మించేయొచ్చని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లాలు బాగా అభివృద్ధి చెందాయని, రాజకీయ ప్రయోజనాల కోసమే 2000లో తెలంగాణ ఉద్యమం వచ్చిందని అన్నారు. నాటి అనుభవాల దృష్ట్యా అటువంటి నమూనా రాజధాని వస్తే దెబ్బతింటామని అభిప్రాయపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసమే చంద్రబాబు అమరావతిలో రాజధాని నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పుడున్న రోడ్లన్నీ గతంలో టిడిపి ప్రభుత్వం వేసినవేనని, ఆ గుంతలు ఇప్పుడు పెద్దవై ఉంటాయని వ్యాఖ్యానించారు. రహదారులను బాగు చేసేందుకు తాము సిద్ధమని చెప్పారు.

తుది నిర్ణయం తీసుకోవద్దు

వైస్ ఛాన్సలర్ల విషయంలో గవర్నర్‌కు కేరళ హైకోర్టు ఆదేశం

కొచి : తమ విచారణ పూర్తయ్యే వరకూ వైస్ ఛాన్సలర్లకు జారీ చేసిన షోకాజ్ నోటీసుపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోవద్దంటూ రాష్ట్ర గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్‌ను కేరళ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. కేరళలోని ఎనిమిది యూనివర్శిటీల వైస్ ఛాన్సలర్లకు హైకోర్టు తాత్కాలిక ఉపశమనం కలిగించింది. వైస్‌చాన్సలర్లు తమ నియామకాల్లో యుజిసి నిబంధనలను ఉల్లంఘించారంటూ గవర్నర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు ఈ నెల 4లోగా సమాధానం ఇవ్వాలని గవర్నర్ ఆదేశించారు. దీంతో ఈ షోకాజ్ నోటీసులను రద్దు చేయాలని హైకోర్టులో వైస్ ఛాన్సలర్లు రిట్ పిటీషన్ వేశారు. దీంతో సమాధానం ఇచ్చే గడువును గత విచారణలో ఈ నెల 7 వరకూ హైకోర్టు పొడిగించింది.

మంగళవారం విచారణలో గవర్నర్ మహమ్మద్ ఖాన్ షోకాజ్ నోటీసులకు వైస్‌ఛాన్సలర్లు ఇప్పటికే సమాధానం ఇచ్చారని వారి తరుపు న్యాయవాది జాబుబాబు తెలిపారు. ఈ కేసులో అఫిడవిట్ దాఖలు చేసేందుకు మూడు రోజుల గడువు కోరారు. తమను రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గవర్నర్ రాసిన లేఖకు స్పందించకపోవడంతోనే ఈ షోకాజ్ నోటీసులు జారీ చేశారని వైస్‌ఛాన్సలర్లు వాదన వినిపించారు. దీంతో ఈ కేసు విచారణ పూర్తయ్యేవరకూ గవర్నర్ ఎలాంటి తుది నిర్ణయం తీసుకోకుండా జస్టిస్ దేవన్ రామచంద్రన్ ఈ తాత్కాలిక ఆదేశాలు జారీ చేశారు. హైకోర్టు తాత్కాలిక ఆదేశాల నేపథ్యంలో వైస్ ఛాన్సలర్లకు ఉపశమనం కలిగినట్లయింది.



ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న మీడియా ప్రతినిధులు

అహంకారం వీడండి

- మీడియాపై అక్కసు ఎందుకు?
- కేరళ గవర్నరు తీరుపై జర్నలిస్టుల ఆగ్రహం

లోపలి పేజీలో..

నాయీ బ్రాహ్మణ వృత్తికి అన్యాయం చేయొద్దు

- ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పురాతనమైన నాయీ బ్రాహ్మణ వృత్తిని దెబ్బతీసే విధంగా కార్పొరేట్ శక్తులైన రిలయన్స్ తదితర సంస్థలు ఎపిలో సెలూన్లు పెడతామని ప్రకటించడం దుర్మార్గమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ బిసి సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎన్.మారేష్ అన్నారు. నాయీ బ్రాహ్మణ వృత్తిదారుల శిక్షణా కేంద్రంలో మంగళవారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సెలూన్లు పెట్టడం ద్వారా నాయీ బ్రాహ్మణుల పొట్టగొట్టే చర్యలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు. వారి వృత్తికి ఆటంకం కలిగించే ఎటువంటి చర్యలనూ సహించబోమని తెలిపారు. దీనిపై ప్రభుత్వం తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, వారికి అండగా నిలబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎలమందరావు, మురళీకృష్ణ, సుబ్బారావు, రాజేశ్వరి, నాగేంద్రబాబు, టి.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

రికవరీ నిలుపుదల పట్ల హర్షం

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ రికవరీని నిలుపుదల చేస్తూ ట్రెజరీ అధికారులకు ఆదేశాలు జారీచేసిన సెక్రటరీ, మున్సిపల్ డైరెక్టర్లకు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ కార్మికుల రాష్ట్రవ్యాప్త పోరాట ఫలితంగా ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. కార్మికుల భయాందోళనలను పరిగణనలోకి తీసుకుని రివకరీ నిలుపుదలకు అధికారులు ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టిన కార్మికులకూ అభినందనలు తెలిపారు.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో నిందితుల విచారణకు హైకోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో ముగ్గురు నిందితుల విచారణకు హైకోర్టు అనుమతించింది. కేసు దర్యాప్తు నిలిపివేయాలంటూ సింగిల్ బెంచ్ గతంలో ఇచ్చిన ఆదేశాలను న్యాయస్థానం కొట్టివేసింది. ఎమ్మెల్యేల కొనుగోలుకు సంబంధించిన అన్ని వివరాలతో పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు విచారించింది. ఇటువంటి కేసుల్లో ఎక్కువ రోజులు దర్యాప్తు నిలిపివేయడం మంచిది కాదని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈకేసును సిబిఐ లేదా స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని బిజెపి దాఖలు చేసిన పిటిషన్‌పై లోతైన విచారణ కొనసాగించాల్సిన అవసరం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. విచారణ పురోగతిపై కౌంటరు దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన హైకోర్టు విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది.నిందితుల విచారణపై స్టే ఎత్తివేయడంతో ముగ్గురు నిందితులను కస్టడీకి కోరుతూ బుధవారం పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నారు.

జిల్లాకో ఐఎఎస్‌ను నియమించాలి

(మొదటిపేజి తరువాయి)

అధికారిక ఏర్పాట్లు చేస్తే తమకు అభ్యంతరం లేదని, అలా కాకుండా ప్రధాని పర్యటనకు వైసిపి దగ్గరుండి ఏర్పాట్లు చేయడం మంచిదికాదని అన్నారు. ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ వాగ్దానం అమలు చేయకుండా ప్రజలను వంచించిన ప్రధానికి రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత లేదని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని, విశాఖ రైల్వే డివిజన్‌ను కొనసాగించడంతోపాటు విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తామని విశాఖ పర్యటనకు ముందే ప్రధాని ప్రకటించాలని డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని అన్ని అంశాల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధానిని నిలదీయాల్సిందిపోయి రాష్ట్ర ప్రభుత్వం, వైసిపి సకల మర్యాదలు చేస్తుండడం ప్రజలను అవమానపర్చడమేనని పేర్కొన్నారు. ప్రజలకు వైసిపి ఇచ్చిన హామీలను మరిచిపోయిందని విమర్శించారు. అమరావతి రాజధానికి నిధులిచ్చి అక్కడే రాజధాని నిర్మాణం జరుగుతుందని ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధాని నుంచి సిఎం సమాధానం రాబట్టాలన్నారు. ఈ నెల 11న విశాఖ స్టీల్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. ప్రజల హక్కుల సాధనకు సిపిఎం ఆధ్వర్యంలో ఆ రోజు నిరసన తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, ఎం.మోహనరావు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటన పేరిట దుకాణాల కూల్చివేత

- రోడ్డున పడ్డ వంద కుటుంబాలు
- న్యాయ పోరాటానికి సిద్ధమైన బాధితులు
- కూల్చివేత దారుణం : సిపిఎం, టిడిపి


జివిఎంసి అధికారులు కూల్చివేసిన షాపులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రధాని మోడీ పర్యటన పేరుతో విశాఖలో పలు దుకాణాలను జివిఎంసి అధికారులు కూల్చివేశారు. విశాఖ పోలమాంబ గుడి సమీపంలోని 25 షాపులను సోమవారం అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో కూలగొట్టారు. కారు షెడ్లు, గ్యారేజ్, చికెన్ షాపులు, టీకొట్లు, టిఫిన్ సెంటర్లతోపాటు అక్కడక్కడా చిన్నపాటి నివాసాలనూ తొలగించారు. కూల్చివేతలతో వంద కుటుంబాలు రోడ్డునపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ విధ్వంసకాండ సరైంది కాదంటూ బాధితులు మండిపడుతున్నారు. తామంతా న్యాయపోరాటం చేస్తామన్నారు. కూల్చివేత అనంతరం బాధితులు మాట్లాడుతూ 1998లో ఈ స్థలంపై ఆంధ్ర యూనివర్సిటీ అధికారులకు, తమకు కోర్టులో విచారణ నడిచిందని, ఆ విచారణలో కోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. ఆ స్థలంపై హక్కులన్నీ తమకే ఉన్నాయని వెల్లడించారు. కోర్టు తీర్పును కూడా లెక్కచేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్లడం తగదన్నారు. రాజకీయ నాయకుల మాటలు విని జివిఎంసి కమిషనర్ ప్రభుత్వానికి వత్తాసు పలకడం సరికాదన్నారు.

కూల్చివేత ప్రాంతాన్ని పరిశీలించిన సిపిఎం, టిడిపి, జనసేన నేతలు

దుకాణాలను కూల్చిన ప్రాంతాన్ని విశాఖ తూర్పు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూల్చివేతల వెనుక ఎంపి విజయసాయిరెడ్డి, ఎయు విసి పివిజిడి.ప్రసాద్‌రెడ్డి హస్తం ఉందని ఆరోపించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రశాంత విశాఖ నగరాన్ని అల్లకల్లోలం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోడీ సభ పేరు చెప్పి సామాన్యుల జీవనోపాధిపై దెబ్బకొట్టడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో సభ అయితే పెదవాల్తేరులో దుకాణాలను కూల్చడం ఏమిటని నిలదీశారు.

కూల్చివేతలను సిపిఎం ఖండించింది. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు కెఎం.కుమారమంగళం, పి.వెంకటరావు, అనపర్తి అప్పారావు తదితరులు బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల కాలం నుంచి ఉన్నటువంటి దుకాణాలు, చిన్నపాటి ఇళ్లను అర్ధరాత్రి వేళ కూలగొట్టడం దారుణమన్నారు. కనీసం తమ సామానులు ఇంకో చోటుకు తీసుకెళ్లడానికి కూడా బాధితులకు అవకాశం ఇవ్వలేదని తెలిపారు. పోలీసులను పెద్ద సంఖ్యలో దింపి అక్కడ ఉన్నవారిని భయభ్రాంతులకు గురి చేసి కూల్చివేతల ప్రక్రియ చేపట్టడం శోచనీయమన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని తెలిపారు. జనసేన నాయకులు పీతల మూర్తి యాదవ్, కోన తాతారావు బాధితులను పరామర్శించారు.

రోడ్‌షోలో రాళ్లు విసిరిన వారిపై చర్యలు

డిఎస్‌పి, సిఐ, ఎస్‌ఐలను సస్పెండ్ చేయాలి

డిజిపికి వర్ల రామయ్య లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ఈనెల 4న ఎన్‌టిఆర్ జిల్లా నందిగామలో రోడ్డుషో నిర్వహిస్తున్న సమయంలో రాళ్లు విసిరిన దుండగులపై చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డికి లేఖ రాశారు. భద్రతా లోపాలకు కారణమైన డిఎస్‌పి, సిఐ. ఎస్‌ఐలను తక్షణమే సస్పెండ్ చేయడంతో పాటు సెక్షన్లను మార్చి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. రోడ్‌షోకు ముందుగానే అనుమతులు తీసుకున్నప్పటికీ తగినంత భద్రత ఏర్పాటు చేయలేదని, రాళ్లదాడి ముందుగానే ప్రణాళిక ప్రకారం జరిగిందనడానికి దాడి చేసే ముందు పవర్‌కట్ చేయడమే నిదర్శనమని లేఖలో పేర్కొన్నారు. దాడిలో చంద్రబాబుపై వేసిన రాయి పక్కనే ఉన్న భద్రతా సిబ్బంది మధుకు తగలడంతో గాయాలపాలయ్యాడని వర్ల రామయ్య పేర్కొన్నారు. రూట్ మ్యాప్ పోలీసులకు ముందే ఇచ్చినప్పటికీ రోడ్‌షో జరిగే చుట్టు పక్కల ఇళ్లను ఎందుకు తనిఖీలు చేయాలేదని ప్రశ్నించారు.

ప్రతిపక్షనేతకు భద్రల కల్పించడంలో పోలీసులు వైఫల్యం చెందారని, దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ఐపిసి 120బి, 332 సెక్షన్ల కింద కేసు నమోదు చేయకుండా 324కింద కేసు నమోదు చేయడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విశాఖలో మంత్రులపై జరిగిన సాధారణ దాడి ఘటనలో ఐపిసి 307తో అటెంప్టటు మర్డర్ కేసు నమోదు చేశారన్నారు. చంద్రబాబు కాన్వాయ్‌లోని సెక్యూరిటీ అధికారికి గాయాలైనప్పటికీ అటెంప్ట్ టు మర్డర్ కేసు కింద ఎందుకు సెక్షన్ల కింద ఎందుకు కేసు నమోదు చేయలేదని ప్రశ్నించారు.

బిసిల ఆత్మగౌరవం పెరిగేలా జగన్‌పాలన

- మంత్రి చెల్లుబోయిన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసిల ఆత్మగౌరవం పెరిగేలా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఉందని రాష్ట్ర బిసి సంక్షేమం, సమాచారశాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. తాడేపల్లి పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల సంక్షేమం కోసం తీసుకొస్తున్న పథకాలు, సంస్కరణలతో వారి జీవితాల్లో పెనుమార్పులు వస్తున్నాయన్నారు. వైఎస్‌ఆర్ తీసుకొచ్చిన ఫీజు రీయంబర్స్‌మెంట్ నేడు జగనన్న విద్యాదీవెనగా మారిందన్నారు. అమ్మ ఒడి, వసతి దీవెన, గోరుముద్ద పథకాలన్నీ బిసి కులాల వారి జీవితాల్లో విద్యాకాంతులు నింపడంతోపాటు జీవన స్థితిగతులను మార్చాయన్నారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడం పట్ల గీత వృత్తిదారులు సిఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు. బిసిల గురించి మాట్లాడే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. మీడియా సమావేశంలో గీత వృత్తిదారులకు సంబంధించిన కులాల కార్పొరేషన్ ఛైర్మన్లు గుబ్బాల తమ్మయ్య (శెట్టి బలిజ), మాదు శివరామకృష్ణ (గౌడ), పిల్లి సుజాత (యాత), కె సంతు (ఈడిగ) పాల్గొన్నారు.

'వెలుగు' అవినీతిపై చర్యలు చేపట్టాలి

- ఐటిడిఎ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా
- రూ.2 కోట్లు అవినీతి జరిగితే చర్యలేవీ : సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని గిరిజన డ్వాక్రా మహిళలను మోసగిస్తూ వెలుగు సిసిలు చేస్తున్న అవినీతిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యాన చింతూరు ఐటిడిఎ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. తొలుత మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన మహిళలు డ్వాక్రా సంఘాల్లో అనేక మోసాలకు గురవుతున్నారని తెలిపారు. డ్వాక్రా రుణాలు తీసుకున్న మహిళలు పూర్తిగా రుణం చెల్లించినా బ్యాంకుల నుండి నోటీసులు వస్తున్నాయన్నారు. పలువురు సిసిలు బినామీల పేరుతో అప్పులు తీసుకొని సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని తెలిపారు. స్త్రీ నిధి నుంచి అప్పులు తీసుకున్న మహిళలు తిరిగి చెల్లించినా వాటిని ఖాతాల్లో జమ చేయకుండా మధ్యలో సిసిలు కాజేస్తున్నారని, రసీదులు అడిగితే బెదిరిస్తున్నారని అన్నారు. ఈ విధంగా చింతూరులోని డ్వాక్రాలో రూ.2 కోట్లు అవినీతి జరిగిందని పేర్కొన్నారు. సిసిలు అవినీతికి పాల్పడుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. సిసిలు చేసే అకృత్యాలను వెంటనే అరికట్టాలని, లేనిపక్షంలో మహిళా సంఘాలతో ఐటిడిఎ వెలుగు కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. సిహెచ్‌సిలో సరిపడా వైద్యులు లేక మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, గైనకాలజిస్టును తక్షణమే నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటిడిఎ పిఒ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. దీనికి స్పందించిన ఆయన వెలుగు, డ్వాక్రా సంఘాలలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలపడంతో ఆందోళన విరమించారు. ధర్నాలో ఐద్వా నేతలు ముర్రం రంగమ్మ, మల్లం సుబ్బమ్మ, ఎంపిటిసి సభ్యులు ఎం.లక్ష్మి, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు ఐ పద్మ పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలని రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం

పరిహారం చెల్లించండి

- ముంపు గ్రామాలను 41.15 కాంటూర్‌లో చేర్చాలి
- కొనసాగిన పోలవరం నిర్వాసితుల రిలే దీక్షలు

ప్రజాశక్తి - కుక్కునూరు (ఏలూరు జిల్లా)

పోలవరం ప్రాజెక్టు కింద పూర్తి ముంపునకు గురవుతున్న గ్రామాలను 41.15 కాంటూర్ మొదటి విడత పరిహారపు జాబితాలో చేర్చాలని, ఇళ్లు కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని, విలీన మండలాల్లో అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు దీక్షలను కొనసాగించారు. ఏలూరు జిల్లా కుక్కునూరులో నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి నిర్వాసితుల సంఘం నాయకురాలు సారంగి లక్ష్మి మాట్లాడుతూ ప్రతియేటా వచ్చే గోదావరి వరదలకు కౌండిన్యముక్తి, ఎల్లప్పగూడెం, మాధవరం, బెస్తగూడెం గ్రామాలు పూర్తి ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ముంపు వల్ల కట్టుబట్టలతో ఇళ్లను వదిలి వెళ్లాల్సిన గ్రామాలను మొదటి విడత పరిహారపు జాబితాలో చేర్చకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం, అధికారుల అనాలోచిత నిర్ణయాలతో పూర్తి ముంపు గ్రామాలను 45.75 కాంటూర్‌లోకి చేర్చి నిర్వాసితులకు తీరని అన్యాయం చేశారన్నారు. తక్షణమే సర్వే నిర్వహించి పూర్తి ముంపులో ఉన్న నాలుగు గ్రామాలను 41.15 కాంటూర్‌లోని మొదటి పరిహారపు జాబితాలోకి చేర్చి పరిహారం ఇవ్వాలని, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నిర్వాసితులు భద్రమ్మ, కృష్ణవేణి, లక్ష్మీ శేషమ్మ, సావిత్రి, మాధవి, చిట్టెమ్మ, బాబూరావు, వీరభద్రం, పాపారావు తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని వ్యవసాయ కార్మికసంఘం, టిడిపి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

సముద్ర తీరంలోనూ పవన విద్యుత్

- గతంలో అలల విద్యుత్‌పైనా ఇదే విధానం
- విజయనగరం జిల్లాలో పైలట్ ప్లాంట్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యుత్ ఉత్పత్తిపై రాష్ట్ర అధికారులు ప్రయోగాలు చేస్తున్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ సముద్ర తీరంలో వచ్చే గాలి ఆధారంగా విద్యుత్ ఉత్పత్తిపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. అలల విద్యుత్ ప్రతిపాదనలు దాదాపు విఫలమైనప్పటికీ, ఆ శాఖ తాజాగా తీరంలో విద్యుత్ ఉత్పత్తి టవర్ల (విండ్ మెట్ మస్ట్స్) ఏర్పాటుకు ప్రతిపాదించింది. వేగం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు గతం నుంచి రాయలసీమ వంటి ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క యూనిట్‌ను కూడా అదనంగా ఉత్పత్తి చేయలేకపోయారు. గతేడాది వరకు ఉన్న 4,083 మిలియన్ యూనిట్ల ఉత్పత్తినే ఇప్పుడు కూడా చూపిస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు వెయ్యి కిలోమీటర్ల సముద్ర తీరంలో వీచే గాలులను విద్యుత్‌గా మరల్చేందుకు సరికొత్త ప్రతిపాదనలతో సంస్థ ముందుకొచ్చింది. అన్ని ప్రాంతాల్లో విండ్ టర్బైన్లు ఏర్పాటుచేసి, విద్యుత్ ఉత్పత్తి అవకాశాలను అధ్యయనం చేయాలని నిర్ణయించింది. త్వరలోనే ఏదైనా సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించాలని భావిస్తోంది. అలల విద్యుత్‌కు సంబంధించి ఒక పైలట్ ప్రాజెక్ట్‌ను విజయనగరం జిల్లా నారాయణ గజపతిపురంలో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. ఇది విజయవంతమైతే ఇతర ప్రాంతాల్లో ఏర్పాటుపై నిర్ణయం తీసుకుంటామని చెబుతున్నారు. సౌర విద్యుత్‌పై వేగంగా అడుగులు వేయాలని భావిస్తున్నారు. సాంప్రదాయేతర ఇంధన వనరుల శాఖ ప్రధాన కార్యాలయంతోపాటు, ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం ఉన్న తాడేపల్లి, తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయం, టిటిడి కార్యాలయాలను ఇందుకోసం గుర్తించారు.

'ఇప్పటం' బాధితులకు రూ .లక్ష : జనసేన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరి నియోజకవర్గం ఇప్పటంలో ప్రభుత్వ దాష్టికానికి గురై ఇళ్లు కోల్పోయిన వారికి ఒక్కొక్కరికి లక్ష రూపాయలు సాయంగా ఇవ్వాలని జనసేన నిర్ణయించింది. ఈ మేరకు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో మార్చి 14న జరిగిన జనసేన ఆవిర్భావ సభకు ఇప్పటం గ్రామస్తులు సహకరించారని, సభాస్థలికి స్థలాన్ని ఇచ్చారనే కక్షకట్టి వైసిపి ప్రభుత్వం ఇళ్లను కూల్చివేసిందని పేర్కొన్నారు. బాధితులకు పవన్‌కల్యాణ్ స్వయంగా ఆర్థికసాయాన్ని అందచేస్తారని తెలిపారు.



విశాఖలో వంటా వార్పు చేస్తున్న నాయకులు

గ్రహణంపై మూఢ నమ్మకాలొద్దు

- జెవివి, దళిత సంఘాల ఆధ్వర్యాన వంటా వార్పు

ప్రజాశక్తి - విశాఖపట్నం

'చంద్ర గ్రహణాన్ని చూడండి - మూఢ నమ్మకాలను విడనాడండి' అని పిలుపునిస్తూ జన విజ్ఞాన వేదిక (జెవివి), దళిత హక్కుల సమాఖ్య, భీమ్ సేన, భారత నాస్తిక సమాజం, ఇండియన్ హ్యూమానిటీస్ సంఘాల ఆధ్వర్యాన విశాఖలోని అంబేద్కర్ భవనం వద్ద వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రహణానికిగల వాస్తవ పరిస్థితులను వివరించారు. రాహువు, కేతువు పాముగా మారి చంద్రున్ని మింగేస్తుందని, అదే చంద్ర గ్రహణమన్న మూఢ నమ్మకం ప్రచారంలో ఉందని, అది వాస్తవం కాదని అన్నారు. చంద్ర గ్రహణం సమయంలో వంటలు చేయకూడదని, ఆహారం తినకూడదని, గర్భిణులు బయటకు రాకూడదని.. వాటికి భిన్నంగా చేస్తే అరిష్టమని తప్పుడు ప్రచారం జరుగుతోందన్నారు. సూర్యునికీ, చంద్రునికీ మధ్యలో భూమి వచ్చినప్పుడు శాస్త్రీయంగా చంద్ర గ్రహణం ఏర్పడుతుందని వివరించారు. చంద్ర గ్రహణాన్ని తిలకించినా, ఆ సమయంలో వంటలు, భోజనాలు చేసినా ఎలాంటి సమస్యలూ ఉండబోవన్నారు. ప్రకృతి నియమం ప్రకారం జరుగుతోన్న విషయాలను, జన్యుపరంగా జరుగుతున్న వాటిని సైన్సు నిరూపిస్తోందని, మూఢ నమ్మకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పాటించవద్దని కోరారు. కార్యక్రమంలో జెవివి విశాఖ, అనకాపల్లి జిల్లాల నాయకులు ఎస్‌వి.రమణ, ఎంఎస్‌విఎస్‌పి.వర్మ, రాష్ట్ర సమతా కన్వీనర్ పి.రాధారాణి, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షులు కొత్తపల్లి వెంకటరమణ, భీమ్‌సేన నాయకులు కె.చిన్నారావు, భారత నాస్తిక సమాజం నాయకులు ఎ.అప్పారావు, వై.నూకరాజు, ఇండియన్ హ్యూమానిటీస్ నాయకులు ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

పేదల బియ్యాన్ని బొక్కేస్తున్నారు

- కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో బియ్యం దిగుబడులు పెరగకపోయినా కాకినాడ పోర్టు నుంచి బియ్యం ఎగుమతులు అమాంతం ఏ విధంగా పెరిగాయాని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ప్రశ్నించారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంట దిగబడులు పెరగలేదని కేంద్ర నివేదికలు చెబుతుంటే ఎగుమతులు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టించడం వల్లే ఎగుమతులు పెరిగాయన్నారు. పేదవాడి బియ్యాన్ని అధికారపార్టీ పెద్దలు బొక్కేస్తున్నారని, ముఖ్యంగా ద్వారంపూడి ఆధ్వర్యంలో మాఫియా రాజ్యం ఏలుతుందన్నారు. కేంద్రం ఇచ్చిన రేషన్ బియ్యంలోనూ 5.70లక్షల టన్నులు మాయం చేసిన బియ్యం మాఫియా 20-21లో 82.75లక్షల టన్నుల ధాన్యం సేకరించినట్లు పేర్కొంటున్నారని, అదే సంవత్సరం దిగుబడులు మాత్రం 78.90లక్షల టన్నులేనని కేంద్ర నివేదికలు చెబుతున్నాయన్నారు. బియ్యం బకాసురులపై సిబిఐ చేత విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డుల ఏర్పాటు

- ఎంటి కృష్ణబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని జిల్లాల్లోనూ డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ రివ్యూ బోర్డులు ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయిలో మానసిక చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంబంధించిన కార్యాచరణను సిద్ధం చేయాలని అధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటి కృష్ణబాబు ఆదేశించారు. మంగళగిరి ఎపిఐఐసి బిల్డింగ్‌లోని వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో స్టేట్ మెంటల్ హెల్త్ అథారిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ మానసిక చికిత్సలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఇప్పటికే ఆరోగ్యశ్రీ అందుబాటులో ఉందని, అన్ని ప్రైవేటు మెడికల్ కళాశాలల్లోనూ ఆరోగ్యశ్రీ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎస్‌ఎంహెచ్‌ఎ డ్రాఫ్ట్ రెగ్యులేషన్స్‌పై సమీక్ష నిర్వహించారు, డిజిటల్ రిజిస్టర్స్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవం, దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం పట్ల కృష్ణబాబు ప్రశంసలు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్‌ఎంహెచ్‌ఎ సిఇఒ అండ్ డిఎంఇ డాక్టర్ వినోద్‌కుమార్, స్పెషల్ సెక్రటరీ నవీన్‌కుమార్‌తోపాటు పలువురు వైద్యాధికారులు పాల్గొన్నారు.

డిసెంబర్ నుంచి పాదయాత్ర

పిసిసి అధ్యక్షులు సాకే శైలజానాథ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నామని పిసిసి అధ్యక్షుల సాకే శైలజానాథ్ తెలిపారు. డిసెంబర్ మొదటివారం నుంచి ఫిబ్రవరి వరకూ సాగే ఈ యాత్రను రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుంచి ప్రారంభిస్తామని చెప్పారు. ఆంధ్రరత్న భవన్లో మంగళవారం జరిగిన పిసిసి విస్తృత సమావేశంలో శైలజానాథ్ మాట్లాడారు. మోడీ, జగన్ ఆడుతున్న నాటకాలపై ప్రజలకు వివరించనున్నామని తెలిపారు. సీనియర్లతో చర్చించిన తరువాత వారం పదిరోజుల్లో అన్ని రాష్ట్ర కమిటీలనూ పూర్తి చేస్తామని చెప్పారు. నాయకులూ గ్రామ, వార్డు కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని వివరించారు. 12వ తేదీన నరేంద్రమోడీ రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో 10, 11 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎఐసిసి కార్యదర్శి మొయప్పన్, తులసిరెడ్డి, మస్తాన్‌వలీ, జెడి శీలం, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రయివేటీకరణ ఆపండి

(మొదటిపేజి తరువాయి)

డిమాండ్ చేశారు. ప్రజల ప్రధాన సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల పదిన డిమాండ్స్ డే జరపాలని నిర్ణయించినట్టు తెలిపారు. దీనిలో భాగంగా పదో తేదీ ఉదయం పది గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగే కార్యక్రమాన్ని, స్టీల్‌ప్లాంట్ రక్షణ కోసం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఇచ్చిన పిలుపులను బలపరుస్తున్నామని ప్రకటించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ కేంద్రంగా సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఏర్పాటుపై 2019లో చేసిన ప్రకటన నేటికీ కాగితాలకే పరిమితమైందన్నారు. జోన్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈలోగా తాత్కాలిక భవనాల్లోనైనా జోన్ ఫంక్షనింగ్ జరిగేలా చూడాలన్నారు. పూర్తి స్థాయి ఫంక్షనింగ్ ఎప్పటిలోగా చేస్తారో ప్రకటన చేయాలని కోరారు. సంవత్సరానికి సుమారు రూ.8,500 కోట్లు ఆదాయం సమకూరుస్తోన్న వాల్తేరు రైల్వే డివిజన్‌ను ఒడిశాకు తరలించడం సరికాదన్నారు. వాల్తేరు డివిజన్‌ను విశాఖలోనే కొనసాగేలా ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వకపోవడంతో అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఇతర ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటుపరం చేయబోమని ప్రధాని ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, బి.జగన్, సిపిఐ జిల్లా నాయకులు ఎస్‌కె.రెహమాన్, సిఎన్‌కె.పాల్, చంద్రశేఖర్, లోక్‌సత్తా నాయకులు జి.సుధీర్‌కుమార్, ఆప్ నాయకులు ఎస్‌కె.నాగూర్, ఎస్.రమేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశానికి హాజరు కావాలని వైసిపికి ఆహ్వానం పంపినా డుమ్మాకొట్టింది.

దేశానికి గేట్‌వేగా ఎపి

(మొదటిపేజి తరువాయి)

నగరాలతో పాటు, అంతర్జాతీయ స్థాయిలో యుఎస్‌ఎ, యుకె, జర్మనీ, ఇజ్రాయిల్ తైవాన్, దక్షిణ కొరియా దేశాల్లో రోడ్‌షోలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో విజయవంతంగా పరిశ్రమలను నడుపుతున్న వారినే ఈ సమ్మిట్‌కు బ్రాండ్ అంబాసిడర్లుగా ఉపయోగించుకోనున్నట్లు మంత్రి తెలిపారు. రామాయపట్నం పోర్టు గురించి మాట్లాడుతూ జనవరి నాటికి తొలి షిప్ వస్తుందని అన్నారు. బందరుపోర్టుకు సంబంధించిన కోర్టుకేసులన్నీ తొలగిపోయాయయని, త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.



ఆలయం తలుపులు మూసివేసిన దృశ్యం

చంద్రగ్రహణంతో శ్రీవారి ఆలయం 11గంటల పాటు మూసివేత

ప్రజాశక్తి- తిరుమల:

చంద్రగ్రహణం కారణంగా తిరుమలలో శ్రీవారి ఆలయాన్ని టిటిడి మూసివేసింది. ఈ నేపథ్యంలో లడ్డూ కౌంటర్, అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని మూతపడ్డాయి. చంద్ర గ్రహణం కారణంగా దాదాపు 11 గంటల పాటు ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేసి నట్లు ఆలయ ప్రధానఅర్చకులల్లో ఒకరైన శేషాచల దీక్షితులు చెప్పారు. స్వామివారికి సుప్రభాతం, తోమాల, అర్చన, మొదటి నైవేద్యం వంటి సేవాకార్యక్రమాన్ని నిర్వహించి ఉదయం 8.40 గంటలకు మహాద్వారం తలుపులను మూసివేశామని తెలిపారు. రాత్రి తిరిగి 7:30 గంటలకు ఆలయ తలుపులను తెరిచి శుద్ధి చేసిన అనంతరం భక్తులను అనుమతించినట్లు చెప్పారు.

ఏలూరు ప్రజాశక్తి స్టాఫ్ రిపోర్టర్ గంగరాజుకు మాతృవియోగం



ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజాశక్తి ఏలూరు స్టాఫ్ రిపోర్టర్ పి.గంగ రాజుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి పి.హైమావతి (67) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం అడవి కొలను గ్రామానికి చెందిన హైమావతికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె భర్త, కుమార్తె కొంతకాలం కిందట మృతి చెందారు. గంగరాజు మూడో కుమారుడు. హైమావతి భౌతికకాయాన్ని ప్రజాశక్తి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, జిల్లా సమన్వయ కమిటీ కన్వీనర్ వివిఎస్ఎస్.ప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం, పలువురు నేతలు సంతాపం తెలిపారు. మంగళవారం సాయంత్రం హైమావతి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతికి ప్రజాశక్తి ఎడిటర్ బి.తులసీదాస్, సిజిఎం వై.అచ్యుతరావు సంతాపం తెలిపారు.

కొత్త నియామకాలు డీలా

- మాంద్యం భయాలు
- ఒత్తిడిలో పలు రంగాలు
- ఎంఇఐ అధ్యయనంలో వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న భయాలు ఉద్యోగ నియామకాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. మాంద్యం ముంచుకొస్తోందనే ఆందోళనలకు తోడు స్టార్టప్ రంగం ఎదుర్కొంటున్న ఫండింగ్ సమస్యలు కొత్త ఉద్యోగాల సృష్టికి ప్రధాన అడ్డంకింగా నిలుస్తున్నాయి. గేడచిన అక్టోబర్‌లోని నియామకాలతో పోల్చితే ప్రస్తుత ఏడాది క్రితం నెల నియామకాల్లో 6 శాతం తగ్గుదల చోటు చేసుకుందని మోన్‌స్టార్ ఎంప్లాయిమెంట్ ఇండెక్స్ (ఎంఇఐ) ఓ రిపోర్టులో తెలిపింది. ప్రతినెల, నెలకు నియామకాలు పడిపోతున్నాయని విశ్లేషించింది.

గడిచిన అక్టోబర్ నెలలో ఆటోమేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, 5జి రంగాల్లో మినహా మిగితా రంగాలన్నీ ఒత్తిడిలోనే ఉన్నాయని తెలిపింది. దేశంలో నియో బ్యాంకింగ్ పద్దతులు పెరుగుతున్న నేపథ్యంలో ఫిన్‌టెక్ రంగంలో ఉద్యోగ కల్పన పెరిగిందని తెలిపింది. పండగ సీజన్ నేపథ్యంలో రిటైల్, ఆభరణాలు, వస్త్రాల రంగంలో నియామకాలకు డిమాండ్ నెలకొందని పేర్కొంది. మరోవైపు బిపిఒ, టెక్నాలజీ ఆధారిత సంస్థలు, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, ఐటి, విద్యా, వైద్య, ఇంజినీరింగ్ తదితర రంగాల్లో ఉద్యోగ కల్పన భారీగా తగ్గిపోయింది.

హైదరాబాద్‌లో 5 శాతం క్షీణత

ద్వితీయ శ్రేణి నగరాల్లో ఉద్యోగ నియామకాల్లో ఏడాదికేడాదితో పోల్చితే 8 శాతం సానుకూలత చోటు చేసుకుంది. కోయంబత్తూర్, అహ్మదాబాద్ నగరాలు స్థిర వృద్ధిని నమోదు చేశాయి. మెట్రో నగరాల్లో ముంబయి కూడా స్థిర వృద్ధిని కల్గించింది. ఈ నగరంలో ఉద్యోగ కల్పనలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్‌లో 5 శాతం, బెంగళూరులో 11 శాతం, కోల్‌కత్తాలో 14 శాతం, ఢిల్లీ-ఎన్‌సిఆర్ 2 శాతం చొప్పున తగ్గుదల నమోదయ్యింది. గుజరాత్‌లోని బరోడాలో ఉద్యోగ కల్పన ఏకంగా 22 శాతం, చండీఘడ్‌లో 16 శాతం చొప్పున పతనం చోటు చేసుకోవడం ఆందోళనకరం. ప్రతీ నెల ఆన్‌లైన్ ఉద్యోగ ప్రకటనలను విశ్లేషించి ఈ రిపోర్టును రూపొందించింది. 2022 అక్టోబర్ 1 నుంచి 31వ తేదిల్లో వచ్చిన మోన్‌స్టార్ ఎంప్లాయిమెంట్ ఇండెక్స్ (ఎంఇఐ) డేటా ఆధారంగా విశ్లేషణ చేసింది.

రంగం	తగ్గిన నియామకాలు
బిపిఒ, ఐటిఇఎస్	(-16%)
మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్	(-24%)
ఐటి	(-19%)
విద్యా	(-11%)
వైద్యం	(-23%)
సప్లయి చెయిన్	(-20%)
ఇంజినీరింగ్	(-20%)

'అదనపు సమన్వయకర్తల' విఫల ప్రయోగం

- 30 నియోజకవర్గాల్లో వైసిపి నేతల నియామకం నిలిపివేత
- తాడికొండ గందరగోళంతో వెనక్కి తగిన అధిష్టానం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

రాష్ట్రంలో వైసిపి ఎమ్మెల్యేల గ్రాఫ్ తక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అదనపు సమన్వయకర్తలను నియమించాలనే ఆ పార్టీ అధినాయకత్వం ప్రయత్నాలకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రాఫ్ పడిపోయిన 30 మంది ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్లు ఇవ్వకూడని పార్టీ అధిష్టానం ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా ఆయా నియోజకవర్గాల్లో పట్టు సాధించడానికి సిట్టింగ్ ఎమ్మెల్యేల స్థానంలో అదే స్థాయిలో పట్టున్న నాయకులను అదనపు సమన్వయకర్తలుగా నియమించాలని పార్టీ అధిష్టానం గత ఆగస్టులో నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆగస్టు 19న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వర ప్రసాద్‌ను గుంటూరు జిల్లా తాడికొండ నియోజకవర్గం అదనపు సమన్వయకర్తగా సిఎం జగన్ నియమించారు. డొక్కా నియామకాన్ని వ్యతిరేకిస్తూ తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి గ్రూపు వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించింది. దీంతో నియోజకవర్గంలో వైసిపి రెండు గ్రూపులుగా విడిపోయింది. శ్రీదేవి అనుకూల, వ్యతిరేక గ్రూపుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. చివరికి పరిస్థితి చేయి దాటిపోతుందని గ్రహించిన అధిష్టానం మాణిక్య వరప్రసాద్‌ను వెనక్కి తగ్గాలని సూచించినట్టు వైసిపి శ్రేణుల్లో ప్రచారమైంది. తాడికొండపై పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని భావించిన మాణిక్య వరప్రసాద్ స్పీడ్‌కు అధిష్టానం బ్రేకులు వేసినట్లవడంతో ఆయన నెల రోజులుగా మౌనంగా ఉంటున్నారు. తాడికొండ తరువాత పొన్నూరు, ప్రత్తిపాడు, గురజాల తదితర నియోజకవర్గాలకు కూడా అదనపు సమన్వయకర్తలను నియమిస్తారని వైసిపిలో జోరుగా ప్రచారం సాగింది. అయితే తాడికొండలో ఈ ప్రయోగం విఫలం కావడంతో ఈ ప్రతిపాదన విరమించుకున్నారు. ఇదే రీతిలో మరో 30 నియోజకవర్గాల్లోనూ అదనపు సమన్వయకర్తల ప్రతిపాదనను తాత్కాలికంగా విరమించినట్లు సమాచారం. అయితే ప్రజల్లో గ్రాఫ్ పడిపోయిన వారికి సిఎం జగన్ ఆరు నెలలు సమయం ఇచ్చారని, ఇందులో భాగంగానే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారని పార్టీ సీనియర్ నాయకుడొకరు తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో పార్టీలో అన్ని తరగతుల నాయకులతో సయోధ్యగా ఉంటూ ప్రజలతో మమేకం కావాలని సూచించారని, ఆరునెలల తరువాత సమీక్షించి అప్పుడు అదనపు సమన్వయకర్తల ప్రణాళికను అమలు చేస్తారని చెప్పారు.

సెలూన్ రంగంలోకి కార్పొరేట్ శక్తులు

- గుంటూరులో నాయీబ్రాహ్మణుల నిరసన



ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

క్షౌరవత్తిదారుల పొట్ట కొట్టడానికి రాష్ట్రంలో రిలయన్స్ సంస్థ ఆరువేల సెలూన్లు పెట్టేందుకు ముందుకు రావటం దుర్మార్గమని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ జెఎసి అధ్యక్షులు తాడికొండ నరసింహారావు అన్నారు. రిలయన్స్‌కు ఇచ్చిన అనుమతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గుంటూరులోని శంకర్ విలాస్ సెంటర్‌లో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెలూన్ రంగంలోకి కార్పొరేట్ శక్తులు ప్రవేశించి వృత్తిని వ్యాపారంగా మార్చడం హీనమైన చర్య అన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా ముందుకు వెళితే కార్పొరేట్ శక్తులు పెట్టే సెలూన్స్‌ను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో జెఎసి నగర కన్వీనర్ టి.శ్రీను, కో-కన్వీనర్ ఎ.బాలకోటి, నాయీ బ్రాహ్మణ సౌందర్య శాలల సంక్షేమ సంఘం నగర కన్వీనర్ కె.బత్తేశ్వరరావు, బిసి మహాజన సభ కన్వీనర్ యు.సాంబశివరావు, రజక జనసేవా సంఘం ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, బిఎస్‌పి నాయకులు జి.శామ్యూల్, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు బి.శ్రీమన్నారాయణ, కె.నాగార్జున, కె.శ్రీను, వై.శంకర్ పాల్గొన్నారు.

వ్యవసాయ మీటర్లు వేగవంతం

- సచివాలయ కార్యదర్శుల సహకారం : ప్రభుత్వ ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విద్యుత్ సంస్కరణల్లో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. దీనిలో భాగంగా విద్యుత్ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడంతో పాటు, ఆ ప్రక్రియను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని బ్యాంకర్లను ఆదేశించింది. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టుకున్న రైతులను గుర్తించడం, వారికి బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవడం వంటి పనులను సార్వత్రికంగా త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. బ్యాంకు ఖాతాల ఏర్పాటు ప్రక్రియ ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని నిర్దేశించింది. మీటర్ల ఏర్పాటు ప్రక్రియతో పాటు, అర్హులైన వారికి బ్యాంకు ఖాతాలను ఏర్పాటు చేయడంలో గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శుల సహకారం తీసుకోవాలని సూచించింది. ఈ మొత్తం ప్రక్రియను విద్యుత్ శాఖ అధికారులు కూడా భాగస్వాములు కావాలని నిర్దేశించారు. వ్యవసాయశాఖ, ఇంధన శాఖ, సచివాలయాల శాఖల అధ్వర్యంలో ఇప్పటికే మీటర్లు పెట్టుకున్న వారి జాబితాను సిద్ధం చేయాలని, కొత్తగా మీటర్లు పెట్టుకోవాల్సిన వారిని కూడా గుర్తించాలని ప్రభుత్వం పేర్కొంది.

ఇళ్ల రుణాలకు వడ్డీ తగ్గించండి : బ్యాంకర్లకు ప్రభుత్వం విజ్ఞప్తి

ఎస్‌హెచ్‌జి ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ఎక్కువ వడ్డీలు వసూలు చేస్తున్న నేపథ్యంలో ఆ వడ్డీ శాతాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కూడా బ్యాంకర్లను రాష్ట్ర ప్రభుత్వం కోరుతోంది. అలాగే రుణ పరిమితితో సంబంధం లేకుండా అన్ని ఇళ్ల రుణాలపై డాక్యుమెంటేషన్ ఛార్జీలను రద్దు చేయాలని విజ్ఞప్తి చేసింది. కౌలు రైతులకు ఆర్థిక సాయాన్ని మరింతగా అందించేందుకు చొరవ చూపించాలని కోరింది.

విశాఖలో రూ.1600 కోట్ల 'రేడియంట్' కుంభకోణం : బండారు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖలో 'రేడియంట్' ప్రాజెక్టు భూ కుంభకోణం విలువ రూ.1600 కోట్లు ఉంటుందని, ఇది ఓ పెద్ద భూమాయ అని టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ఆరోపించారు. విశాఖలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'రేడియంట్ ప్రాజెక్టు భూ కుంభకోణంపై తాను కొద్ది రోజుల కిందట చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నట్టు తెలిపారు. తనపై పరువు నష్టం దావా వేస్తానని వైసిపి ఎంపి వేమూరి ప్రభాకర్‌రెడ్డి ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ భూ కుంభకోణం వ్యవహారంపై సిబిఐతో దర్యాప్తు జరిపించాలని, తన వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదవాన్ని కుమారుడు అనిల్‌రెడ్డితో కలిసి ఎంపి ప్రభాకర్‌రెడ్డి ఈ దోపిడీకి తెర తీశారని ఆరోపించారు. జగన్ కుటుంబం ప్రభాకర్‌రెడ్డికి ఒక పావుగా వాడుకుంటోందని విమర్శించారు. విశాఖలోని పారిశ్రామికవేత్తలను బెదిరించి వారి ఆస్తులను లాక్కుంటున్నారని, రాజధాని పేరుతో ఈ దోపిడీ సాగుతోందని ఆరోపించారు. జివిఎంసి కమిషనర్‌గా నిజాయితీతో పని చేసిన లక్ష్మీశను ఎందుకు బదిలీ చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

మానసిక వికాసానికి బాలోత్సవం దోహదం

- బాలోత్సవం కార్యాలయం ప్రారంభోత్సవంలో వక్తలు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)

ఆటలు, పాటలు, సాంస్కృతిక కళా ప్రదర్శనల్లో పిల్లలను ప్రోత్సహించేందుకు బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని పలువురు ప్రముఖులు అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో బాలోత్సవ కార్యాలయం మంగళవారం ప్రారంభమైంది. కార్యాలయాన్ని మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.సతీష్ ప్రారంభించగా, కార్యా లయం చిరునామా బోర్డును ఫ్యూజన్ ఫుడ్ అండ్ బేవరేజెస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ పి.లక్ష్మి, ల్యాప్‌టాప్‌ను ఆంధ్రనాటక కళాపరిషత్ చైర్మన్ నన్నపనేని నాగేశ్వరరావు ఆవిష్కరించారు.



మంగళగిరి - తాడేపల్లి బాలోత్సవం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు టి.సతీష్

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లల ఆలోచనలు, వారి అభిప్రాయాలను పెద్దలు గౌరవించాలని అన్నారు. పిల్లల్లో ప్రశ్నించేతత్వం తోపాటు వారు స్వతంత్రంగా ఎదిగేలా పెద్దలు కృషి చేయాలని సూచించారు. పిల్లల మానసిక వికాసానికి బాలోత్సవం వంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. ఎంటిఎంఎస్ (మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పోరేషన్) పరిధితోపాటు దుగ్గిరాల, తుళ్లూరు మండలాల్లోని సుమారు 210 పాఠశాలలకు బాలోత్సవానికి సంబంధించి బ్రోచర్‌లు అందిస్తామని తెలిపారు. వచ్చే నెల 6, 7 తేదీల్లో కెఎల్.యూనివర్సిటీలో జరిగే మంగళగిరి- తాడేపల్లి బాలోత్సవం పిల్లల పండుగలో 40 అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం కోశాధికారి గాదె సుబ్బారెడ్డి, నిర్మల జూనియర్ కాలేజి ప్రిన్సిపల్ వివి.ప్రసాద్, కెఎల్.యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీపతిరాయ్, బాలోత్సవాల రాష్ట్ర సమన్వయకర్త పిన్నమనేని మురళికృష్ణ, మాజీ సైనికోద్యోగి గోపాలం సాంబశివరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనీల్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు గాదె సుబ్బారెడ్డి, అమరావతి బాల్సోతవం నిర్వాహకులు ఐజక్ న్యూటన్, ఎం.భాగ్యరాజు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న కేసన శంకరరావు, ఇతర నాయకులు

ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధం

- బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు విరుద్ధమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరావు అన్నారు. 103వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేస్తూ తాను ఎపి హైకోర్టులో పిల్ వేశానని తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆర్థికంగా బలహీన వర్గాలు అనే పేరుతో ఆధిపత్య కులాలకు 103వ రాజ్యాంగ సవరణ ద్వారా ఈ రిజర్వేషన్ తెచ్చారని విమర్శించారు. ఒబిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు ఇది నష్టదాయకమన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కేంద్రం ఈ చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. 85 శాతంగా ఉన్న బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి 15 శాతంగా ఉన్న ఆధిపత్య కులాలకు పది శాతం రిజర్వేషన్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కులగణన చేయాలని కోరుతున్నా పట్టించుకోని బిజెపి..ఇప్పుడు ఇడబ్ల్యుఎస్ చట్టం చేయడం దుర్మార్గమన్నారు. దీనికి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు కె.క్రాంతికుమార్, కె.శివరాం బాబాజీ, బి.శ్రీను, ఎ.బాలయ్య, కె.అశోక్ కుమార్, స్వాతి గౌడ్, పి.పుష్పాంజలి పాల్గొన్నారు.

సంపాదకీయం

విద్వేష కుట్ర

అందమైన మాటలతో, అందరూ నిజమేనేమో అనుకునేలా విద్వేషపు విషాన్ని కుమ్మరించి, సమాజాన్ని నిలువునా చీల్చడంలో అందె వేసిన మోడీ సర్కారు మతోన్మాద ఎజెండాను మరింతగా రుద్దేందుకు సిద్ధమవుతున్నట్టుంది. అందుకోసమే వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను మళ్లీ తెరపైకి తెస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ పశ్చిమ బెంగాల్‌లో సిఎఎ అమలు చేస్తామని తాజాగా కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రకటించారు. సిఎఎ ప్రక్రియ మళ్లీ మొదలైందని ఆ రాష్ట్రానికే చెందిన బిజెపి నాయకుడు సువేందు అధికారి అంతకుముందే పేర్కొన్నారు. గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని బిజెపి ఎన్నికల మేనిఫెస్టోల్లో చేర్చింది. జాతీయ స్థాయిలో తీసుకోవాల్సిన ఈ నిర్ణయాన్ని ఉద్దేశపూర్వకంగానే ప్రస్తావిస్తూ, ప్రజలను చీల్చేందుకు కుట్ర చేస్తున్నారనే విమర్శలు వస్తుండగానే సిఎఎకు తొలిమెట్టుగా భావించే జాతీయ జనాభా రిజిస్టర్ (ఎన్‌పిఆర్) అంశాన్ని కేంద్ర హోం మంత్రిత్వశాఖ మళ్లీ ముందుకు తెచ్చింది. జనన మరణాలు, వలసల కారణంగా మార్పులను చేర్చడానికి మళ్లీ తాజా పర్చాలని 2021-22 వార్షిక నివేదికలో పేర్కొంది. 2015లో ఎన్‌పిఆర్ వివరాలను సవరించినప్పటికీ అది చాలదని, మరిన్ని కొత్త విషయాలను చేర్చాలని పేర్కొంది. సిఎఎ నిబంధనలు ఇప్పటివరకూ తయారు చేయలేదని కేంద్రమే సుప్రీంకోర్టుకు తెలిపింది. పాలల్లో విషపు చుక్క.. ప్రజాస్వామ్యంలో మత రాజకీయపు ముక్క... అన్నట్లు దేశవ్యాప్తంగా ప్రజల మధ్య చీలిక తీసుకొచ్చి భయాందోళనల మంటలు రేకెత్తించి, ఆ మారణహోమాన్ని ఓట్ల రూపంలో మరోసారి మలచుకోవాలని పాలక బిజెపి భావిస్తోంది. దేశవ్యాప్తంగా ఎన్‌ఆర్‌సి చేసినప్పుడు పౌరుల రిజిస్టర్ నుంచి మినహాయించబడిన ముస్లిమేతరులు ప్రయోజనం పొందుతారని, మినహాయించబడిన ముస్లిములు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుందనే భయాలున్నాయి. 2019 డిసెంబర్ నుంచి 2020 మార్చి మధ్య దేశవ్యాప్తంగా సిఎఎపై వెల్లువెత్తిన నిరసనలు, అల్లర్లలో 83 మంది ప్రాణాలు కోల్పోయారు. ట్రంప్ భారత పర్యటన సమయంలోనే 2020 ఫిబ్రవరి ఢిల్లీ అల్లర్లలో మతోన్మాదుల దుశ్చర్యలు, విద్వేష పూరిత వీరంగాలు యావద్భారత దేశాన్ని కలవరపాటుకు గురిచేశాయి. 2021 ఏప్రిల్ - డిసెంబర్ మధ్య పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి ముస్లిమేతర మతాలకు చెందిన 1,414 మందికి పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేశారని కేంద్ర నివేదిక పేర్కొంది. 2,439 మందికి లాంగ్ టర్మ్ వీసాలు కూడా మంజూరు చేశారు. మరోవైపు సిఎఎ, ఎన్‌ఆర్‌సి, ఎన్‌పిఆర్‌లను వ్యతిరేకించిన వారిని ఉగ్రవాదులుగా, అర్బన్ నక్సలైట్లుగా ముద్ర వేసి జైళ్లలో మగ్గేలా చేస్తున్నారు. ఇందుకు చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం యుఎపిఎను సాధనంగా చేసుకుంటున్నారు. 2015 నుంచి 2020 వరకూ ఈ చట్టం కింద అరెస్టు చేసిన వారిలో మూడు శాతం కంటే తక్కువమందిపైనే నేరారోపణలు రుజువయ్యాయని నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో డేటా విశ్లేషించింది. మూడింట రెండొంతుల కేసులలో నిందితులకు ఎటువంటి ఉగ్రవాద చర్యతో సంబంధం లేదు. ఈ కఠిన చట్టం కింద 5,924 కేసులు నమోదు చేసి, 8,371 మందిని ఐదేళ్లలో అరెస్టు చేశారు. వారిలో 235 మందికే శిక్షలు పడ్డాయి. ఈ గణాంకాలను బట్టి ఈ కేసులలో డొల్లతనాన్ని, ప్రత్యర్థులను, తన చర్యలను వ్యతిరేకించే వారిని ఎంత దారుణంగా వేధిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. వందమంది దోషులు తప్పించుకున్నా.. ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదన్న భారత న్యాయవ్యవస్థ స్ఫూర్తికి భిన్నంగా ఉంది. ఎన్‌ఆర్‌సి, సిఎఎను తిరిగి తీసుకొచ్చేందుకు మోడీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలు ప్రజల మధ్య విద్వేష విషాన్ని చిమ్మడానికే! ఇటువంటి వాటిని దేశ ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించాలి. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ విధానం అని చాటిచెప్పాలి. కుల, మత, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా భారతీయులంతా ఒక్కటే అంటూ విద్వేష కుట్రల్ని వమ్ముచేయాలి.

మహనీయుల మాట




గెలుపు అందరికీ దొరకదు.
కానీ...
గెలిచే శక్తి మాత్రం
అందరిలోనూ వుంటుంది.
- సిసిరో

బిజెపి విద్రోహానికి పారం చెప్పాలి

సందర్భం

నవంబరు 11వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి విశాఖకు విచ్చేస్తున్నారు. ఇదే విశాఖలో 2014లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో మాట్లాడుతూ విడగొట్టబడిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని మోడీ హామీ ఇచ్చారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజి ఇస్తామన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న అన్ని హామీలను - విశాఖ రైల్వే జోన్, గిరిజన యూనివర్సిటీ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర అంశాల అమలుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆ వాగ్దానాలు చేసి ఇప్పటికి ఎనిమిదేళ్ళు పూర్తయింది. అయినా ఆచరణలో అతీగతీ లేదు. ఒక్క అంగుళం కూడా ముందుకు కదలలేదు. పైగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వబోమని స్పష్టంగా తేల్చిచెప్పారు. రైల్వే జోన్ ఇప్పటికీ త్రిశంకు స్వర్గంలో ఉంది. జోన్ కావాలంటే డివిజన్ వదులుకోవాలని షరతు పెడుతున్నది. ఇంతకన్నా దుర్మార్గం ఇంకోటి లేదు. చేసిన వాగ్దానాలను తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచారు. రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి మరోసారి ఉత్తరాంధ్ర గడ్డపై అడుగు పెడుతున్న మోడీని నిలదీయాలి. ఇప్పటికైనా చేసిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేయాలి. హామీలు అమలు చేయకుండా తెలుగు గడ్డపై అడుగు పెడితే సహించబోమని హెచ్చరించాలి.





వి. శ్రీనివాసరావు

చేసిన వాగ్దానాలను అమలు జరపకపోగా ఉత్తరాంధ్ర అభివృద్ధికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని తెగనమ్మడానికి మోడీ నాయకత్వం లోని కేంద్ర ప్రభుత్వం పూనుకుంటోంది. ఒకవైపు విశాఖ ప్రజలు ప్రభుత్వ రంగాన్ని కాపాడాలని మొత్తుకుంటుంటే మరోవైపు ప్రభుత్వ రంగాన్ని పునాదులతో సహా పెకిలించివేయడానికి మోడీ ప్రభుత్వం నడుం కట్టింది. సంవత్సరంన్నర కాలంగా విశాఖ ఉక్కు కార్మికులు నిరంతరాయంగా ఆందోళన సాగిస్తూనే ఉన్నారు. వారికి మద్దతుగా విశాఖ నగర ప్రజలు వివిధ సంఘాల ఆధ్వర్యంలో జెఎసిగా ఏర్పడి సంఘీభావ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీలు ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తున్నాయి. ట్రేడ్‌యూనియన్లు ఐక్యంగా పోరాడుతున్నాయి. అయినా మోడీ వీటినేమీ లెక్క చేయడం లేదు. బంగారు బాతు లాంటి ఫ్యాక్టరీని కారు చౌకగా అదానీ పరం చేయాలని చూస్తున్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కు. ఉమ్మడి రాష్ట్ర విభజన సందర్భంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరగకుండా నివారించేందుకు ప్రత్యేక హోదా ఇవ్వాలని పార్లమెంటులో నాటి ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ ప్రతిపాదించగా బిజెపి బల్లలు చరుస్తూ బలపరిచింది. ఆనాడు బిజెపి ఒత్తిడితో కాంగ్రెస్ బిల్లు పెట్టింది. ఈ రెండూ కుమ్మక్కై రాష్ట్ర విభజనకు పూనుకున్నాయి. ప్రత్యేక హోదా ఇస్తే పారిశ్రామికీకరణ వేగంగా జరుగుతుందన్న ఆశతో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న చదువుకున్న యువత మోడీపై నమ్మకంతో ఓటు వేశారు. నేడు మోడీ ఆ నమ్మకాన్ని వమ్ము చేసి వెన్నుపోటు పొడిచారు. ఏ యువత కారణంగా మోడీ అధికారంలోకి వచ్చారో నేడు ఆ యువతరం తీవ్ర ఆగ్రహావేశాలతో ఉంది. తమకు నమ్మకద్రోహం చేసిన మోడీకి పాఠం నేర్పాలని అవకాశం కోసం ఎదురు చూస్తోంది. ప్రత్యేక హోదా చట్టరీత్యా ఇవ్వడం సాధ్యం కాదని 14వ ఆర్థిక సంఘం సిఫార్సులు దీనికి ఆటంకంగా ఉన్నాయని బిజెపి అబద్ధాల ప్రచారం చేస్తున్నది. 14వ ఆర్థిక సంఘం నిధుల పంపిణీకి తప్ప ప్రత్యేక హోదాకు ఎలాంటి సంబంధం లేదు.

దేశంలో ఈపాటికే బడా కార్పొరేట్ సంస్థలకు పెద్దయెత్తున రాయితీలు ఇస్తున్నారు. లక్షల కోట్లు బ్యాంకు అప్పులు ఎగ్గొడుతున్నా ఏ చర్యా తీసుకోవడం లేదు. పన్ను ఎగ్గొడుతున్నా పట్టించుకోవడం లేదు. పైగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో ఎదురు రాయితీలు ఇస్తోంది. ఒకవైపు చట్టవిరుద్ధంగా బడా కార్పొరేట్లకు దేశాన్ని దోచిపెడుతూ, మరోవైపు ప్రత్యేక హోదా ఇస్తే పారిశ్రామికవేత్తలకు అదనపు రాయితీలు ఇవ్వాల్సి వస్తుందని సాకులు చెబుతోంది. నిజానికి ఇది ఆర్థిక సమస్య కాదు. రాష్ట్రం పట్ల రాజకీయ వివక్షత. ఈ రాష్ట్రంలో బిజెపి బలహీనంగా ఉంది. అధికారంలోకి ఎలాగూ రాదు. కాబట్టి ఎందుకు శ్రద్ధ పెట్టాలన్న ధోరణితో వ్యవహరిస్తోంది. ప్రత్యేక హోదా ఇవ్వడం వల్ల కేంద్రానికి గాని, ఇతర రాష్ట్రాలకు గానీ ఎలాంటి నష్టం జరగదు. ఇతర రాష్ట్రాలతో పోటీ తెస్తోంది. గతంలో బీహార్, జమ్మూకాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాలకు ఇలాగే ద్రోహం చేసింది.

ప్రత్యేక హోదాతో చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు వచ్చే అవకాశముంది. ఈ రోజు ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టిన నేపథ్యంలో ప్రభుత్వ ప్రోత్సాహం లేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలనేకం మూతపడ్డాయి. లేదా నష్టాల్లో మునిగి తేలుతున్నాయి. వీటిని గట్టెక్కించడానికి ప్రత్యేక హోదా ఒక సాధనం. ఈ రోజు అత్యధిక ఉపాధి కల్పిస్తున్నది చిన్నతరహా పరిశ్రమలు. వాటికి ఆదరణ లేక మూత పడడం వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోతున్నారు. ఇప్పటికే మన రాష్ట్రంలో టెక్స్‌టైల్స్, సహకార డెయిరీ, చక్కెర పరిశ్రమలు, పేపర్ మిల్లులు, ఆటో, రవాణా, లెదర్ బిజినెస్‌లు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. జిఎస్‌టి పన్నులు, విద్యుత్ ఛార్జీల భారం, చిన్న పరిశ్రమల పట్ల అధికారుల వేధింపులు పారిశ్రామికాభివృద్ధిని దెబ్బ కొడుతున్నాయి. పారిశ్రామిక రంగం నెగిటివ్ గ్రోత్ లోకి వెళ్ళిపోతోంది. మరోవైపు రాష్ట్రంలో ఉన్న బడా పెట్టుబడిదారులు ఎవరూ ఈ రాష్ట్రాభివృద్ధికి పెట్టుబడులు పెట్టడం లేదు. రాష్ట్ర సంపదను ఇతర ప్రాంతాలకు తరలించుకు పోతున్నారు. అలా పెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని అభ్యర్థించడం లేదు. పారిశ్రామికాభివృద్ధి పేరుతో రాష్ట్రంలో ఇప్పటివరకూ రెండున్నర లక్షల ఎకరాల భూమిని రైతుల నుండి బలవంతంగా లాక్కున్నారు. ఇందులో 55 వేల ఎకరాలు మినహా మిగతాదంతా ఖాళీగా ఉంది. అందులో పరిశ్రమలు పెట్టరు. ఉపాధి కల్పించరు. చట్ట నిబంధనలు ఉల్లంఘించిన పారిశ్రామికవేత్తలపై చర్యలు ఉండవు. భూముల్ని తిరిగి పండించుకోవడానికి రైతులకూ ఇవ్వరు. అటు వ్యవసాయం పోయి, ఇటు పరిశ్రమలూ రాక వెనుకబడిన ప్రాంతాల ప్రజలు వలస బాట పడుతున్నారు. తాత్కాలికంగానైనా ఈ దుస్థితి నుండి బయట పడాలంటే ప్రత్యేక హోదా ఇవ్వక తప్పదు.

కానీ మన రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు - వామపక్షాలు మినహా - దీనిపై ఏమాత్రం శ్రద్ధ పెట్టడం లేదు. 2019 ఎన్నికలకు ముందు సవాళ్ళు, ప్రతిసవాళ్ళు విసురుకున్న పార్టీలు ఇప్పుడు నోరెత్తడంలేదు. నాడు ప్రత్యేక హోదా కోసం రాజీనామాలు చేయాలని తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సిపి, జనసేన ఒకరిపై ఒకరు బురద చల్లుకున్నారు. 2018 ఫిబ్రవరిలో వామపక్షాల పిలుపుతో అత్యంత జయప్రదమైన రాష్ట్ర బంద్ ప్రభావం ఈ పార్టీలపై పడింది. తెలుగుదేశం బిజెపి నుండి తెగదెంపులు చేసుకుని బయటకు రావాల్సిన స్థితిని ప్రజా ఉద్యమం కల్పించింది. 25 మంది ఎంపీలను ఇస్తే హోదా సాధించుకొస్తామని జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ వాగ్దానం చేశారు. ఎంపీలను గెలిపించి ప్రజలు మాట నిలుపుకున్నారు. కానీ జగన్ మాట తప్పారు. దాని గురించి మాట్లాడడానికి కూడా సిద్ధపడడంలేదు. ఎన్నికల ముందు గాండ్రించిన తెలుగుదేశం ఇప్పుడు పిల్లి కూతలు కూడా కూయడం లేదు. నాడు బిజెపిని పాచిపోయిన లడ్డూతో పోల్చిన జనసేన నేత పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఆ లడ్డూలనే ఆరగించడానికి సిద్ధపడుతున్నారు. ఈ ముగ్గురూ ఇప్పుడు ప్రత్యేక హోదాని గంపలో పెట్టి దాచేశారు. దానిని బయటకు తీసుకువస్తే బిజెపికి కోపం వస్తుందని భయపడుతున్నారు. గతంలో తాము చెప్పిన మాటలనే ఇప్పుడు దిగమింగి ప్రత్యేక హోదా చర్చనీయాంశమే కాదంటున్నారు.

నాడు ప్రత్యేక హోదానే ప్రధాన ఎజెండాగా చేసిన తెలుగు మీడియా నేడు ఆ సమస్యను ప్రస్తావించడానికి కూడా సిద్ధపడడం లేదు. ప్రధాన రాజకీయ పార్టీలకు వత్తాసుగా ఉన్న మీడియా ప్రజల ఎజెండాను తొక్కిపెట్టి తమ సొంత ఎజెండాలను ప్రజలపై రుద్దుతున్నది. ప్రత్యేక హోదా అంశం ముందుకు రాకుండా ప్రధాన రాజకీయ పార్టీలు చేస్తున్న కుయత్నాలను రాష్ట్ర ప్రజలు తిప్పికొట్టాలి. ఇప్పటికైనా ప్రధాన మీడియా ప్రత్యేక హోదా ఎజెండాను ప్రధానంగా చేపట్టాలి.

విశాఖ రైల్వే జోన్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాటకాలు ఆడుతున్నాయి. విశాఖ రైల్వే జోన్ ఇవ్వలేమని రైల్వే బోర్డు బహిరంగంగా ప్రకటించినా వైఎస్‌ఆర్‌సిపి నాయకులు మాత్రం వచ్చేసినట్లు ప్రకటిస్తున్నారు. ప్రధాని పర్యటన సందర్భంగా రైల్వే జోన్‌కు ప్రారంభోత్సవం జరుగుతుందని ప్రకటించి ఇప్పుడు వెనక్కి తగ్గారు. రోజుకో మంత్రి తలా ఒక విధంగా ప్రకటన చేస్తూ ప్రజలను గందరగోళం చేస్తున్నారు. రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ప్రధాని శంకుస్థాపన చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఇప్పటికే నగదీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ల ప్రైవేటీకరణకు పూనుకున్నది. అందులో విశాఖ కూడా ఒకటి. ప్రభుత్వ ఖర్చుతో రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించి పైసా ఖర్చు లేకుండా పెట్టుబడిదారుల హస్తగతం చేయడానికి మోడీ ప్రభుత్వం పూనుకున్నది. ఆధునికీకరణ తరువాత ప్లాట్‌ఫారం ఛార్జీలతో సహా ప్రయాణీకులపై ఛార్జీల భారం మోపుతారు. రైలు ప్రయాణమే కనాకష్టమవుతుంది. ఇప్పటికే గంగవరం పోర్టును మింగేసిన అదానీ మోడీ మద్దతుతో మొత్తం ఉత్తరాంధ్రనే హస్తగతం చేసుకోవాలని చూస్తున్నారు. జగన్ దీనికి వత్తాసు పలుకుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అదానీప్రదేశ్‌గా మార్చడానికి రాష్ట్ర ప్రజలు అనుమతించరాదు.

ప్రజలకు చెప్పింది ఒకటి. వారు చేస్తున్నది మరొకటి. ప్రజలు కోరుతున్నదొకటి. వారు మాట్లాడుతున్నది మరొకటి. రాష్ట్ర ఎజెండాను హైజాక్ చేసి ప్రజల చెవులో పూలు పెట్టడానికి మరొకసారి విశాఖపట్నం వస్తున్న ప్రధానిని రాష్ట్ర ప్రజలంతా నిలదీయాలి. రాష్ట్రంలో బిజెపి కి నిలువ నీడ లేకుండా చేయాలి. ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిన బిజెపి, మోడీ, కేంద్ర ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలి.

/వ్యాసకర్త : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి/

పెద్ద నోట్ల రద్దుకు అడ్డగోలు సమర్ధనలు

విమర్శ


దేశ చరిత్రలో పెద్ద నోట్ల రద్దు జనానికి ఒక పెద్ద పీడ కల, పాలకులకు ఘోర వైఫల్యం. ఆరు సంవత్సరాల తరువాత 'పెద్ద నోట్ల రద్దు లక్ష్యాన్ని సాధించిందా?' అన్న అంశాన్ని విచారించేందుకు ఐదుగురు జడ్జీలతో కూడిన సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ అంగీకరించింది. తీర్పు తీరు తెన్నులు ఎలా ఉన్నప్పటికీ పెద్ద నోట్ల రద్దు నిర్ణయ ఫలితాలు, పర్యవసానాల మంచి చెడ్డల గురించి జరిగే చర్చలో అనేక అంశాలు వెలుగులోకి వస్తాయి.

పెద్ద నోట్ల రద్దు ద్వారా నల్లధనాన్ని వెలికి తీస్తామని, ఉగ్రవాదులు, ఇతర విద్రోహ శక్తులకు నిధులు అందకుండా చూస్తామని, సమాంతర ఆర్థిక వ్యవస్థ అంతు చూస్తామని, తెరవెనుక లావాదేవీలను బహిర్గతపరుస్తామని ప్రధాని నరేంద్ర మోడీ 2016 నవంబరు 8న పెద్ద నోట్ల రద్దు ప్రకటనలో చెప్పారు. లెక్కాపత్రం లేని ధనాన్ని పన్ను అధికారులకు వెల్లడించటం లేదా బ్యాంకుల్లో జమ మినహా మరొక మార్గం లేదన్న ఎందరో దాన్ని అవినీతి, నల్లధనంపై మెరుపు (సర్జికల్) దాడిగా పేర్కొన్నారు. ఆ తరువాత తెలంగాణలో జరిగిన హుజూరాబాద్ ఉప ఎన్నిక, ఇప్పుడు మునుగోడు ఉప ఎన్నికలో లెక్కా పత్రం లేని డబ్బు ప్రవాహాన్ని చూసిన తరువాత మోడీ అమాయకుడై అలా చెప్పారా లేక జనాలను వెంగళప్పలుగా భావించినట్లా? ఇటీవలనే పశ్చిమ బెంగాల్ మంత్రి పార్థా చటర్జీ, అతని సన్నిహితురాలు అపర్ణా ముఖర్జీ ఇళ్లలో అధికారికంగా ప్రకటించిన రూ.49.80 కోట్ల నగదు కట్టలు, ఐదు కోట్ల విలువైన బంగారం వారి వద్దకు ఎలా చేరినట్లు? ఇది సముద్రంలో కాకి రెట్ట వంటిది. నిజానికి చిత్తశుద్ధితో దాడులు చేస్తే దేశంలో అలాంటివి ఇంకా ఎన్ని దొరికేదీ చెప్పాల్సిన పని లేదు.



ఎం. కోటేశ్వరరావు

పెద్ద నోట్ల రద్దు వలన సుమారు నాలుగున్నర లక్షల కోట్ల మేర నగదు చలామణి నుంచి అదృశ్యమౌతుందని ఎస్‌బిఐ ప్రధాన ఆర్థిక సలహాదారు సౌమ్యకాంతి ఘోష్ 2016 నవంబరు 14వ తేదీన బిజినెస్ స్టాండర్డ్ పత్రికలో రాసిన విశ్లేషణలో పేర్కొన్నారు (అంటే ఆమేరకు ప్రభుత్వానికి లబ్ధి చేకూరినట్లే). పోపుల డబ్బాల్లో దాచుకొని నోట్ల రద్దు తెలియని వారు, ఇతర కుటుంబ సభ్యులకు తెలపకుండా కొంత మొత్తాలను దాచుకొని అవి వెల్లడైతే కుటుంబంలో కలతల గురించి భయపడినవారు తప్ప...నల్ల ధనికులందరూ తమ సొమ్మును తెల్లగా మార్చుకున్నారని అధికారిక గణాంకాలే చెప్పాయి. ఆశించిన ఫలితాలు రాకపోవటంతో భంగపడిన అధికారపార్టీ పెద్దలు పెద్ద నోట్ల రద్దు వలన అసలెందుకు చేశారో చెప్పటం మానేసి దీని వలన డిజిటల్ చెల్లింపులు పెరిగాయి కదా అని వాదించారు. అది కూడా నిజం కాదు. కార్డుల ద్వారా చెల్లిస్తే రెండు శాతం అదనంగా వసూలు చేస్తుండటంతో జనాలు తిరిగి నగదుకే మొగ్గారు. అనేక దుకాణాల్లో యుపిఐ చెల్లింపులను అంగీకరించటం లేదు. కార్డులు లేదా యుపిఐ లావాదేవీలను పెంచేందుకు ప్రపంచంలో ఏ దేశంలో కూడా పెద్ద నోట్ల రద్దు అనే పిచ్చిపనులు చేయలేదు. కానీ కొందరు ఈ ఘనతను నరేంద్రమోడీకి ఆపాదించేందుకు మరో సాకు లేక పెద్ద నోట్ల రద్దుకు ముడిపెట్టారు.



పెద్ద నోట్ల రద్దు గురించి అరుణ్ జైట్లీ ఆర్థిక మంత్రిగా 2017 ఫిబ్రవరి రెండున పార్లమెంటులో చేసిన ప్రసంగంలో చెప్పిందేమిటి? 2016 నవంబరు ఎనిమిది నుంచి డిసెంబరు 30 వరకు రెండు నుంచి 80 లక్షల వరకు డిపాజిట్లు చేసిన ఖాతాలు 1.09 కోట్లు కాగా ఒక్కొక్క ఖాతా సగటు మొత్తం రూ.5.03 లక్షలు, 80 లక్షలకు మించి దాఖలు చేసిన ఖాతాలు 1.48 లక్షలు, వీటి సగటు రూ.3.31 కోట్లు. వీటిని మరొక విధంగా చెప్పారు కొందరు. రూ.80 లక్షల లోపు డిపాజిట్లు చేసిన ఖాతాల్లో చేరిన మొత్తం రూ.5.48 లక్షల కోట్లు కాగా అంతకు మించి చేసిన ఖాతాల మొత్తం రూ.4.89 లక్షల కోట్లు. ఆర్‌బిఐ ప్రకటించిన దాని ప్రకారం 99 శాతం పైగా నగదు వెనక్కు వచ్చింది, రిజర్వుబ్యాంకు నివేదిక ప్రకారం 99.3 శాతం రద్దయిన నోట్లు వెనక్కు తిరిగి వచ్చాయి. 10,720 కోట్లు మాత్రమే వెనక్కు రాలేదని, మొత్తం నోట్లలో 0.0005 శాతం అంటే 5,22,783 మాత్రమే నకిలీ నోట్లను కనుగొన్నట్లు రిజర్వుబ్యాంకు వెల్లడించింది. రిజర్వుబ్యాంకు అధికారికంగా చెప్పినదాని ప్రకారమే వెనక్కు రాని నోట్ల కంటే కొత్త నోట్లు అచ్చేసి, పంపిణీ చేసేందుకు అయిన ఖర్చు ఎక్కువ. పదమూడు వేల కోట్ల రూపాయలని చెప్పింది. రద్దు చేసిన నోట్ల విలువ రూ.15.44 లక్షల కోట్లు. మూడో వంతు (31 శాతం) సొమ్ము రూ.4.89 లక్షల కోట్లు 80 లక్షలకు పైగా డిపాజిట్లు కేవలం 1.48 లక్షల మంది నుంచే వచ్చిందంటే నోట్ల రద్దు వలన లబ్ధి పొందింది నల్ల మహా ధనికులా మరొకరా?

పెద్ద నోట్ల రద్దు తరువాత నగదు రహిత ఆర్థిక వ్యవస్థగా మారిందని చెప్పే పెద్దమనుషులతో, డిజిటల్ లావాదేవీలు పెరిగాయంటూ టీ స్టాల్, కూరల దుకాణాల ఉదాహరణలు చెప్పేవారితో నాకు పేచీ లేదు. అది వేరే సమస్య. పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలకు అవినీతితో సంబంధం ఉంటుందని పెద్ద నోట్ల రద్దు ప్రసంగంలో నరేంద్ర మోడీ నే చెప్పారు. నోట్ల రద్దు జరిగి ఆరేళ్ల కావస్తోంది, నల్లధనం ఎలా జడలు విరుచుకొని తిరుగుతోందో రిజిస్ట్రారు కార్యాలయాలను సందర్శించిన వారికి తెలిసిందే.

పెద్ద నోట్ల రద్దుకు ముందు 2015-16లో నగదు చెలామణి జిడిపిలో 12.1 శాతం ఉంది. రద్దు తరువాత సంవత్సరం అది 8.7 శాతానికి తగ్గింది. నగదును తీసుకొనేందుకు బ్యాంకులు పడిన ఇబ్బంది గురించి వాటిలో పని చేసే వారికి తెలుసు. తరువాత అది ఇంతింతై వటుడింతై అన్నట్లుగా నరేంద్రమోడీ ఏలుబడిలో కొత్త రికార్డులను బద్దలు చేసింది. నగదు చెలామణి - అవినీతికి ఉన్న సంబంధం గురించి ప్రధాని నరేంద్ర మోడీ చెప్పినట్లుగా వరదలపుడు గోదావరి నీటి మట్టం పెరిగే మాదిరి 2021-22లో 16.8 శాతానికి పెరిగింది. మోడినోమిక్స్ ప్రకారం ఉక్రెయిన్ సంక్షోభం లేకున్నా నగదు చెలామణితో ద్రవ్యోల్బణం, ధరలు పెరిగి ఉండేవి. గత ఏడాది కేంద్ర ప్రభుత్వం చమురు మీద పన్నులు తగ్గించినపుడు బంకుల వద్ద పన్నుల గురించి బోర్డులు పెట్టాలని బిజెపి పెద్దలు చెప్పినట్లుగా ఇప్పుడు అవినీతి స్థాయి గురించి బోర్డులు పెడితే తప్ప జనానికి అర్థం కాదు.

పెద్ద నోట్ల రద్దు వలన పన్నుల వసూలు పెరిగిందని చెప్పవచ్చు తప్ప దానికి ఆధారాలు చూపటం చాలా కష్టం. ఎందుకంటే అది జరిగిన కొద్ది నెలలకే 2017 జులైలో జిఎస్‌టి విధానాన్ని తీసుకు వచ్చారు. ఆ తరువాత కార్పొరేట్ పన్ను మొత్తాన్ని గణనీయంగా తగ్గించారు. అందువలన పన్ను లక్ష్యాలను ఏ మేరకు సాధించిందీ, దాన్ని పెద్ద నోట్ల రద్దుకు ముందు తరువాత చూడాలన్నది కొందరి అభిప్రాయం. తాత్కాలికంగా ఇబ్బందులు పెట్టినా దీర్ఘకాలంలో పరిస్థితి మెరుగు పడుతుందని చెప్పారు. కానీ జరిగిందేమిటి? పెద్ద నోట్ల రద్దుకు ముందు 2011-12 నుంచి 2016-17 వరకు జిడిపి వృద్ధి రేటు 5.2 నుంచి 8.3 శాతానికి పెరిగింది. తరువాత దానికి భిన్నంగా కరోనాకు ముందు 2019-20 నాటికి నాలుగు శాతానికి దిగజారింది. మరుసటి ఏడాది కరోనాతో 7.3 శాతం తిరోగమనంలో పడింది. తరువాత వృద్ధి రేటు ఇంకా కరోనా పూర్వపు స్థితికి చేరుకోలేదు. అలాంటపుడు ఏ శాస్త్రీయ పరిశీలన ప్రాతిపదికన పెద్ద నోట్ల రద్దుకు-పన్నుకు ముడిపెట్టారు? అదేవిధంగా యుపిఐ చెల్లింపుల పెరుగుదల గణనీయంగా ఉంది. అది పెద్ద నోట్ల రద్దుకు ముందే ప్రారంభమై ఉంటే తరువాత పెరుగుదల ఎక్కువగా ఉంటే దాని ఫలితమే అనవచ్చు. యుపిఐ సౌకర్యాన్ని ప్రవేశపెట్టిందే 2016 ఏప్రిల్ పదకొండున, ఆ ఏడాది అసలు లావాదేవీలు జరగలేదు. 2017 నవంబరు నాటికి కూడా నామమాత్రమే. అందువలన దానికి పెద్ద నోట్ల రద్దుకు సంబంధమే లేదు.

పన్ను ఎగవేతలు, ఆర్థిక నేరాలకు తావు లేకపోతే గత ఎనిమిదిన్నర సంవత్సరాల్లో విపరీతంగా పెరిగిన దాడులకు ఏ భాష్యం చెబుతారు? పోనీ దాడులతో సాధించింది ఏమిటో చెప్పాలి. 2004 నుంచి 2014 వరకు 112 ఇ.డి దాడులు జరిగితే 2014 నుంచి 2022 వరకు 3,010 దాడులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొన్నది. నూటపన్నెండు దాడుల్లో స్వాధీనం చేసుకున్న మొత్తం రూ.5,346 కోట్లు. సగటున 47.73 కోట్లు. కాగా 3010 దాడుల్లో స్వాధీనం చేసుకున్నది రూ.99,356 కోట్లు సగటున 33 కోట్లు ఉంది. దేశంలో అక్రమ లావాదేవీలు ఇంతేనా? ఎంతకాలం జనాన్ని మభ్య పెడతారు. 3010 కేసుల్లో శిక్షలు పడింది కేవలం 23 ఉదంతాల్లోనే, అందుకే వీటిని ప్రతిపక్షాల నేతల మీద బెదిరింపు దాడులని జనాలు అనుకుంటున్నారు. ఏటా జిఎస్‌టి 85 వేల కోట్ల మేరకు ఎగవేస్తున్నట్లు బ్రిటన్‌కు చెందిన రుబిక్స్ సంస్థ అంచనా వేసింది. ప్రభుత్వం కూడా దాదాపు ఇలాంటి మొత్తాల గురించే అధికారికంగా ప్రకటిస్తున్నది. ఇలాంటి వైఫల్యాల గురించి ఎన్నైనా చెప్పుకోవచ్చు. సుప్రీం కోర్టులో తన చర్యను కేంద్ర ప్రభుత్వం ఎలా సమర్థించుకుంటుందో ఏ వాదనలను ముందుకు తెస్తుందో చూద్దాం! ★

జనవాక్యం

మన గోడు కాదులే...

మునుగోడు ఎన్నికల ఫలితం...ఆ మాట కొస్తే దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లో జరిగిన ఏడు ఉప ఎన్నికల ఫలితాల గురించి...అట్టే ఆలోచించడానికి ఏమీ లేదు. ఎవరి స్థానాల్లో వారున్నారు. ఏడు స్థానాల్లో నాలుగు స్థానాలు బిజెపి గెలుచుకుంది. అందులో మూడు గతంలో తాను ప్రాతినిధ్యం వహించినవే.. నిలుపుకుంది. ఇంకో రెండు స్థానాల ఎన్నికలు బిజెపి లోకి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేరగా వచ్చినవి. అందులో ఒకటి వచ్చింది ఒకటి పోయింది. అందరి దృష్టి తెలంగాణలో మునుగోడు పై ఉండింది. ఎందుకంటే అక్కడి అధికార పార్టీ తెరాస...బిజెపి వ్యతిరేక పార్టీగా జాతీయ స్థాయిలో రూపుదిద్దుకోనుంది. పైగా అక్కడి శాసనసభ ఎన్నికలు ఏడాదికే రానున్నాయి. ఇలాంటి పరిస్థితిలో అది గెలవడం చాలా అవసరం. ఇక బిజెపి ఆ రాష్ట్రంలో అధికార పార్టీకి తానే గట్టి పోటీదారునని నిరూపించుకోవాలన్న ఉద్దేశ్యం తోనే ఈ ఉప ఎన్నికను తీసుకు వచ్చింది. ఆ రెండు బలమైన పార్టీలూ అన్ని రకాలా బలాల్ని ఒడ్డి పోరాడాయి. అందులో భాగంగా ఇరు పార్టీల సౌజన్యంతో అతి ఖరీదైన ఎన్నికలుగా డబ్బు, మద్యం ప్రవహించిన పోటీగా తయారైంది. ఇప్పుడు తెరాస గెలిచింది. అయితే ఒక బల నిరూపణ కోసం, ఒక పైచేయి కోసం ఏ మార్పూ తేలేని ఒక తతంగానికి ఇంత విచ్చలవిడిగా డబ్బు ఖర్చు పెట్టాలా? ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి ఆయా పార్టీలు తెస్తున్న చేటు కొలవగలమా? ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, బాధలు, సిద్ధాంతాలు మ్యానిఫెస్టోలు వెనక్కిపోయి, రాద్ధాంతమే కీలకమైన వ్యూహంగా మార్చడం. అందుకు అధికార పక్షాలు ముందు నిలవడం మంచి పరిణామాలు కావు. సామాన్యుడికి ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే ఈ ధోరణికి ఇది అంతం కాదు..ఆరంభం. డబ్బు ప్రభావం లేని ఎన్నికల సంస్కరణలు వచ్చేలా పౌర సమాజం ఒత్తిడి తీసుకు రాలేకపోతే పరిస్థితిలో మార్పును ఆశించడం అత్యాశే.

- డా॥ డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

పెట్టుబడిదారి దేశాలే నష్టపరిహారం ఇవ్వాలి

- పర్యావరణ విధ్వంసానికి వాటిదే బాధ్యత
- కాప్ సదస్సులో పేద దేశాల డిమాండ్



ఈజిప్ట్ అధ్యక్షులు అబ్దుల్ ఫత్తా అల్ సిసి

షర్మ్ ఎల్-షేక్ (ఈజిప్ట్) : భూతాపాన్ని (గ్లోబల్ వార్మింగ్) ఎదుర్కొనడానికి మరింత కఠినమైన కార్యాచరణ తక్షణ అవసరమని వర్ధమాన, నిరుపేద దేశాల నేతలు నినదించారు. తాము చేయని తప్పులకు మూల్యం చెల్లించలేమని స్పష్టం చేశారు. భూతాపం బాధ్యత పారిశ్రామిక విప్లవ సమయంలో లాభాలు దండుకున్న సంపన్న పెట్టుబడిదారీ దేశాలదేనని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న నష్టాలు, ఇబ్బందులకు పెట్టుబడిదారి దేశాలు పరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. మంగళవారం నాటి సమావేశాల్లో పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌తో సహా పలువురు నేతలు ప్రసంగించారు. వేసవి కాలంలో పాక్‌లో వచ్చిన భీకరమైన వరదలతో దాదాపు 4 వేల కోట్ల డాలర్ల మేరకు నష్టం జరిగింది. లక్షలాది మంది నిర్వాసితులయ్యారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఇటువంటి ఉపద్రవాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో వాతావరణ మార్పుల కారణంగా సంభవిస్తున్న నష్టాలకు నష్టపరిహారం చెల్లించాలనే అంశంపై ప్రధానంగా ఈ సదస్సులో చర్చ జరుగుతోంది.

నైజీరియా పర్యావరణ మంత్రి మహ్మద్ అబ్దుల్లా మాట్లాడుతూ, ప్రకృతి విపత్తులను తీవ్రంగా ఎదుర్కొంటున్న దేశాల పట్ల సానుకూలంగా స్పందించాల్సిందిగా సంపన్న దేశాలను కోరారు. ఈ నష్టాలను తగ్గించుకునేందుకు పెద్ద ఎత్తున సాయం జరగాలన్నది ఇప్పుడు మన ప్రాధాన్యతగా వుండాలన్నారు. జీవన్మరణాల్లో దేన్నో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన పరిస్థితి ఇప్పుడు తమ ముందుందని టాంజానియా అధ్యక్షులు సామియా సులూ హసన్ అన్నారు. "చేయని తప్పులకు ఆఫ్రికా మూల్యం చెల్లించరాదు" అని సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ అధ్యక్షులు ఫాస్టిన్ ఆర్చేంజ్ టుడెరా పేర్కొన్నారు. ఇప్పటి వాతావరణ సమస్యలకు కారణం సంపన్న దేశాలేనని ఆయన విమర్శించారు. 'వాతావరణ మార్పులనేవి మా ప్రజల ప్రాణాలకు, ఆరోగ్యానికి, భవిష్యత్‌కు ముప్పుగా పరిణమించాయి.' అని కెన్యా అధ్యక్షులు విలియం కె రూటో అన్నారు. 2050 కల్లా వాతావరణ మార్పుల నష్టపరిహారం ఏడాదికి 5 వేల కోట్ల డాలర్లుగా వుండాలని కోరారు.

వాతావరణ సంక్షోభంతో అత్యంత ఎక్కువగా ఇబ్బందులు పడుతున్న, నష్టాలను ఎదుర్కొంటున్న వర్ధమాన దేశాలకు సాయం చేసేందుకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఈజిప్ట్ అధ్యక్షులు అబ్దుల్ ఫత్తా అల్ సిసి కోరారు. షర్మ్ ఎల్ షేక్ వాతావరణ హామీల అమలు సదస్సు (ఎస్‌సిఐఎస్) ప్రారంభోత్సవంలో ప్రసంగిస్తూ సిసి ఈ వ్యాఖ్యలు చేశారు. కాలుష్య ఉద్గారాలను తగ్గించే దిశగా నిజమైన, నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలని ప్రపంచ నేతలకు విజ్ఞప్తి చేశారు. వర్ధమాన దేశాలకు అవసరమైన సాయం చేయాలని కోరారు. 'సమయం మించి పోతోంది. ఇచ్చిన హామీల అమలు నుండి వెనక్కి వెళ్లేందుకు అవకాశం లేదు.' అని ఆయన పేర్కొన్నారు. తమ ప్రాధాన్యతలను గుర్తించి, సమస్యలను పరిష్కరించే దిశగా స్పందిస్తున్నారనే భావన వర్ధమాన దేశాల్లో ముఖ్యంగా ఆఫ్రికన్ దేశాల్లో నెలకొనడం అవసరమని అన్నారు. విశ్వాసపూరితమైన వాతావరణాన్ని సృష్టించడం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుందన్నారు.

అర్థాంతరంగా వెళ్లిపోయిన బ్రిటన్ ప్రధాని

వాతావరణ సదస్సు -కాప్ 27 నుండి బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ తన సిబ్బందితో కలిసి అర్థాంతరంగా బయటకు వెళ్లిపోయారు. దీంతో సభకు హాజరైన ప్రతినిధులకు, సభ్యులకు అక్కడ ఏం జరిగిందో అర్థంకాలేదు. కొంత సేపు గందరగోళం నెలకొంది. సదస్సు నుండి ప్రధాని తన సిబ్బందితో బయటకు వెళుతున్న దృశ్యాలు మీడియాలో వైరలయ్యాయి. 'కాప్-27 సదస్సులో భాగంగా అడవుల పరిరక్షణ భాగస్వామ్య కార్యక్రమాన్ని ప్రారంభిస్తుండగా.. రిషి సునాక్ మధ్యలోనే వెళ్లిపోయారు' అని బ్రిటన్‌కు చెందిన కార్బన్ బ్రీఫ్ అనే మీడియా వెబ్‌సైట్ డైరెక్టర్ లియో హికమన్ తన ట్విటర్ ఖాతాలో పేర్కొంటూ.. ఆ వీడియోను షేర్ చేశారు. 'వాతావరణ సదస్సులో బ్రిటన్ ప్రధాని వేదికపై కూర్చుని ఉండగా.. ఆయన సిబ్బంది ఒకరు వచ్చి సునాక్‌తో ఏదో విషయం చెప్పారు.

దాని గురించి వారిద్దరూ కొంద సేపు చర్చించారు. అప్పటికీ రిషి అలాగే కూర్చుని ఉన్నారు. కొద్దిసేపటి తర్వాత మరో సిబ్బంది వచ్చి రిషిని అక్కడి నుంచి వెళ్లిపోదామని కోరారు' అని హికమన్ మరో ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇది జరిగిన రెండు నిమిషాలకే రిషి వేదికపై నుంచి దిగి తన సిబ్బందితో కలిసి హడావుడిగా సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. పేద దేశాలు బాధ్యతలను గుర్తు చేయడంతోనే ఆయన పరారైనట్లు పలువురు పర్యావరణ కార్యకర్తలు సోషల్‌మీడియాలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

అహంకారం వీడండి

- కేరళ గవర్నరు తీరుపై జర్నలిస్టుల ఆగ్రహం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్యానికి నాలుగో స్థంభంగా భావించే స్వతంత్ర మీడియా సంస్థలపైనా కక్ష కట్టినట్టు వ్యవహరిస్తున్న కేరళ గవర్నరు మహ్మద్ ఆరీఫ్ ఖాన్ తీరును జర్నలిస్టులు తీవ్రంగా ఖండించారు. కైరాలి, మీడియా వన్ సంస్థలపై నిషేధం విధిస్తున్నట్లు ఆరీఫ్ ఖాన్ ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద పలువురు పాత్రికేయులు మంగళవారం నాడు నిరసన తెలియజేశారు. గవర్నరు తీరును ఖండిస్తూ నినాదాలు రాసిన ప్లకార్డులు చేబూని ఆందోళన చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందించి ప్రజాస్వామ్యాన్ని సుస్థిరపర్చే చర్యలు చేపట్టాల్సిన రాజ్యంగబద్ధ పదవిలో ఉంటూ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే చర్యలకు పాల్పడటం సరికాదని నినదించారు. ఈ కార్యాక్రమంలో పలువురు సీనియర్ పాత్రికేయులు పాల్గొన్నారు. కేరళకు చెందిన రాజ్యసభ సభ్యులు వి శివదాసన్ సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కేరళ గవర్నర్‌ను రాష్ట్రపతి వెంటనే రీకాల్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవిలో కొనసాగే అర్హత ఆరీఫ్ మహమ్మద్ ఖాన్‌కు ఏమాత్రం లేదని ఆయన పేర్కొన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో కెయుడబ్ల్యుజె (ఢిల్లీ) అధ్యక్ష, కార్యదర్శులు ప్రసూన్ ఎస్ కాంతిల్, డి ధనసుమోద్, ఉపాధ్యక్షులు ఎం ప్రశాంత్, ఢిల్లీ జర్నలిస్ట్ యూనియన్ (డియుజె) అధ్యక్షులు ఎస్‌కె పాండే, అరవింద్ పిఆర్, జిల్బీ థామ్సన్ (కైరాలి), హరికృష్ణన్, విష్ణు ప్రసాద్ (మీడియా వన్), సవాద్ ముహమ్మద్ (మనోరమ టివి), కె ఎం వాసుదేవన్ (దేశాభిమాని), జె జగదీష్ (ప్రజాశక్తి) తదితరులు పాల్గొన్నారు.

మహిళపైకి దూసుకెళ్లిన వందేభారత్

గాంధీనగర్ : వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు మరోసారి ప్రమాదానికి గురయింది. గుజరాత్‌లోని ఆనంద్ రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఒక మహిళపైకి దూసుకెళ్లడంతో ఆమె మృతి చెందింది. మంగళవారం సాయంత్రం 4:37 గంటకు ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతిరాల్ని అహ్మదాబాద్‌కు చెందిన 54 ఏళ్ల బీట్రైస్ ఆర్చిబల్డ్ పీటర్‌గా గుర్తించారు.

త్రిపురలో బిజెపికి మరోదెబ్బ

- కీలక మంత్రి రాజీనామా

అగర్తల : త్రిపురలో బిజెపికి మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. అసెంబ్లీ ఎన్నికలకు కేవలం నాలుగు నెలల ముందు అధికార కూటమిలోని కీలకమైన నేత, రాష్ట్ర అటవీ, గిరిజన శాఖ మంత్రి మేవన్ కుమార్ జమతియా మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇండిగోనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపిఎఫ్‌టి) నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న మేవన్ కుమార్ జమతియా తన రాజీనామా లేఖను స్పీకర్ రతన్ చక్రవర్తికి అందచేశారు. 2018 ఎన్నికల్లో కోవై జిల్లాలోని అశారంబరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జమతియా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాగా, గత ఏడాది కాలంలో రాజీనామా చేసిన మూడో ఐపిఎఫ్‌టి ఎమ్మెల్యే జమతియా కావడం గమనార్హం. అధికార బిజెపి-ఐపిఎఫ్‌టి కూటమిలో రాజీనామా చేసినవారిలో ఏడో ఎమ్మెల్యే. ఇప్పటికే బిజెపి నుంచి నలుగురు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్‌తో విభేదాల కారణంగా రాజీనామా సంగతి విదితమే.



ఎస్ఎఫ్ఐ ఘన విజయం

కొజికోడ్ : కేరళలోని కోజికోడ్ జిల్లాలో పలు కళాశాలల్లో మంగళవారం నిర్వహించిన విద్యార్థి సంఘ గుర్తింపు ఎన్నికల్లో భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఘనవిజయం సాధించింది. జిల్లాలో 58 ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలకు ఎన్నికల్లో వీటిల్లో 45 కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ విజయభేరీ మోగించింది. కాలికట్ యూనివర్శిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీల్లో రెండు సంవత్సరాల విరామం తరువాత ఈ ఎన్నికలు జరిగాయి. కోవిడ్ నేపథ్యంలో రెండు సంవత్సరాలు ఈ ఎన్నికలు జరగలేదు. కొజికోడ్ జిల్లాలో మొత్తంగా 108 ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలు ఉన్నాయి. అయితే ఎయిడెడ్ కాలేజీలు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కాలేజీలతో సహా సమారు సగానికి పైగా కాలేజీల్లో ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు జరిగిన కాలేజీల్లో ఎస్ఎఫ్ఐ, కేరళ స్టూడెంట్ యూనియన్ (కెఎస్‌యు), ముస్లిం స్టూడెంట్స్ ఫేడరేషన్ (ఎంఎస్ఎఫ్) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. కొన్ని కాలేజీల్లో కెఎస్‌యు, ఎంఎస్ఎఫ్ సంయుక్తంగా యుడిఎస్ఎఫ్ బ్యానర్ కింద పోటీ చేసినా ఎస్ఎఫ్ఐ విజయం సాధించింది.

సిజెఐగా నేడు జస్టిస్ చంద్రచూడ్ పదవీస్వీకారం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ)గా జస్టిస్ డివై చంద్రచూడ్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. దేశ 49 సిజెఐగా జస్టిస్ యుయు లలిత్ మంగళవారం పదవీ విరమణ చేశారు. దీంతో 50వ సిజెఐగా జస్టిస్ డివై చంద్రచూడ్ బాధ్యతలు చేపట్టనున్నారు. 2024 నవంబర్ 10 వరకు జస్టిస్ చంద్రచూడ్ పదవిలో కొనసాగుతారు.

జస్టిస్ చంద్రచూడ్ ప్రస్థానం..

2016 మే 13న సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అంతకు ముందు 2013-16లో అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగానూ, 2000-13లో ముంబయి హైకోర్టు న్యాయమూర్తిగానూ సేవలందించారు. మహారాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్‌గా కూడా బాధ్యతలు నిర్వహించారు. 1998 నుండి న్యాయమూర్తిగా నియామకం వరకు అదనపు సొలిసిటర్ జనరల్ ఆఫ్ ఇండియాగా బాధ్యతలు చేపట్టారు.

భారత్ జోడో యాత్రలో అపశృతి

- గుండెపోటుతో కాంగ్రెస్ సేవాదళ్ నేత మృతి



ముంబయి : తెలంగాణ నుండి మహారాష్ట్ర చేరుకున్న భారత్ జోడో యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. ఈ యాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ సేవాదళ్ ప్రధానకార్యదర్శి కృష్ణ కుమార్ పాండే మంగళవారం నాడు గుండెపోటుతో మరణించారు. యాత్ర కొనసాగుతుండగానే.. కష్ణ కుమార్ ఒక్కసారిగా కుప్పకూలారని, వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలించామని, అయితే అప్పటికే పాండే మరణించారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. చివరి క్షణాల్లోనూ.. సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌తో కలిసి త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని యాత్రలో పాండే చురుగ్గా పాల్గొన్నారని, గుండెపోటు రావడంతో కుప్పకూలారని పేర్కొన్నారు. కరుడుగట్టిన కాంగ్రెస్ వాదిగా నాగ్‌పూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్‌ను పాండే ధీటుగా ఎదుర్కొనేవాడని కొనియాడారు. పాండే మృతిపై రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శిగా కష్ణకాంత్ సేవలను ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 7న ప్రారంభమయిన రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పూర్తి చేసుకుని ప్రస్తుతం మహారాష్ట్రలో జరుగుతోంది. మంగళవారం నాందేడ్ జిల్లాలోని గురుద్వారాను సందర్శించి రాహుల్ తన యాత్రను కొనసాగించారు.

హేతువాదులపై భజరంగ్‌దళ్ గూండాల దాడి

భువనేశ్వర్ : ఒడిషాలోని లోహియా అకాడమీలో భజరంగ్‌దళ్ గూండాలు మంగళవారం రెచ్చిపోయారు. చంద్ర గ్రహణం రోజున మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న హేతువాదులపై భౌతిక దాడులుకు దిగారు. గ్రహణం రోజున ఆహారం తినడం వల్ల ఇబ్బందులేమీ ఉండవని, అదంతా మూఢవిశ్వాసమంటూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఒడిషాలోని పలు ప్రాంతాల్లో హేతువాదులు వంటావార్పు కార్యాక్రమం నిర్వహించారు. పలుచోట్ల ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు భజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రయత్నించారు. కొన్ని చోట్ల భౌతిక దాడులు చేశారు. భువనేశ్వర్‌లోని లోహియా అకాడమీలో సామూహిక విందును ఏర్పాటు చేసిన హేతువాదులపై ఒక్కసారిగా దాడులకు పాల్పడ్డారు. దీంతో పలువురు హేతవాద కార్యకర్తలు గాయపడ్డారు. అకాడమీ ప్రాంగణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు లాఠీఛార్జీ కూడా చేశారు. లాఠీఛార్జీ ఘటనలోనూ పలువురు గాయపడ్డారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ భజరంగ్‌దళ్ ఇతర హిందూత్వ మతోన్మాద మూకలు అభ్యుదయ వాదులపైనా, హేతువాదులపై దౌర్జన్యాలకు పాల్పడినట్లు సమాచారం.

మాతృభాషలు.. మాండలికాలపై సర్వే

- సదృశ్య సహితంగా ఆర్కైవ్ ఏర్పాటు
- కేంద్ర హోంశాఖ వార్షిక నివేదికలో వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా 576 భాషలు, మాండలికాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో వీడియోగ్రఫీ ద్వారా కేంద్ర హోంశాఖ చేపట్టిన సర్వే పూర్తి అయింది. 'మదర్ లాంగ్వేజ్ సర్వే ఆఫ్ ఇండియా (ఎంటిఎస్ఐ)' పేరిట చేపట్టిన ప్రాజెక్టు వివరాలపై హోంశాఖ వార్షిక నివేదికలో ప్రత్యేకంగా వివరించారు. మాతృభాషల్లోని మమకారాన్ని, నుడికారాన్ని పరిరక్షించడానికి నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి)లో వెబ్ ఆర్కైవ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు హోంశాఖ తెలిపింది. ఇప్పటికే ఆయా భాషలకు సంబంధించిన ఆడియో, వీడియోలతో సచిత్ర, సదృశ్యంగా రూపొందించిన డేటాను నిక్షిప్తం చేసి పరిశోధనలకు, విశ్లేషణలకు వినియోగిస్తామని తెలిపింది. వీటిని ప్రజలకు కూడా అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొంది.

వార్షిక నివేదికలో మరికొన్ని కీలక అంశాలు..

- కోవిడ్ రెండో వేవ్‌లో ఆక్సిజన్, రెమిడెసివర్ కొరత తీవ్రంగా ఉన్నట్లు కేంద్ర హోంశాఖ తన నివేదికలో అంగీకరించింది. 'ఏప్రిల్ 2021 నుండి కోవిడ్ కేసులు పెరిగిపోవడంతో మెడికల్ ఆక్సిజన్, రెమ్‌డెసివిర్, ఇతర ప్రాణాధార మందుల డిమాండ్ పెరిగింది' అని నివేదిక పేర్కొంది.
- జాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్ఐఎ) 2022 మార్చి 31 నాటికి 438 కేసులను నమోదు చేసిందని నివేదిక పేర్కొంది. వాటిలో 349 కేసులకు ఛార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు, 89 కేసుల్లో విచారణ ముగిసినట్లు, 83 కేసుల్లో శిక్షలు పడినట్లు పేర్కొంది. 42 సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా, 31 మంది తీవ్రవాదులుగా ప్రకటించినట్లు తెలిపింది.
- 2013తో పోల్చితే 2021లో హింసాత్మక సంఘటనలు 1,136 నుండి 509 వరకు తగ్గాయని, 63 శాతం తగ్గినట్లు హెూం మంత్రిత్వ శాఖ పేర్కొంది. మరణాలు 397 నుండి 147 వరకు తగ్గాయని, 55 శాతం తగ్గినట్లు తెలిపింది.
- దేశంలో నేరాల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు కేంద్ర హోంశాఖ నివేదికలో స్పష్టమైంది. 2020లో దేశంలో 66,01,285 నేర ఘటనలు జరిగాయి. 2019 (385.5 నేర రేటు) కంటే 2020లో 487.8 శాతానికి పెరిగింది. హత్యలు 29,193, కిడ్నాప్, అపహరణ 84,805, మొత్తం హింసాత్మక నేరాలు 4,00,006 ఘటనలు జరిగాయి. చిన్నారులపై నేరాలు 1,28,531, ఎస్‌సిలపై 50,291, ఎస్‌టిలపై 8,272, వద్ధులపై 24,794 నేరాలు జరిగాయి. ఆర్థిక నేరాలు 1,45,754, సైబర్ క్రైం 50,035 ఘటనలు చోటు చేసుకున్నాయి.



త్వరలో తొలి ప్రైవేట్ రాకెట్

- స్కైరూట్ ఎరోస్పేస్ సన్నాహాలు
- 'ప్రారంభ్' మిషన్‌ను ఆవిష్కరించిన ఇస్రో ఛైర్మన్

న్యూఢిల్లీ : భారత అంతరిక్ష పరిశోధన రంగంలో తొలిసారి ఒక ప్రయివేటు సంస్థ రూపొందించిన రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. నేల మొదలు నింగి వరకూ ప్రయివేటు రంగానికి పెద్ద పీఠ వేస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ జపం చేస్తున్న నేపథ్యంలో ఇస్రో ఈ కార్యక్రమానికి జెండా ఊపడం విశేషం. ఈ నెల 12 నుంచి 16వ తేదీల మధ్యలో 'విక్రమ్' పేరిట ఈ ప్రయివేటు రాకెట్ ప్రయోగం చేపట్టే వీలుందని హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఎరోస్పేస్ మంగళవారం ప్రకటించింది. వాతావరణ పరిస్థితులను పరిగణలోకి తీసుకొని తుది తేదీని ఖరారు చేస్తామని స్కైరూట్ ఎరోస్పేస్ సిఇఓ కోఫౌండర్ పవన్ కుమార్ చందన తెలిపారు. 'ప్రారంభ్' పేరుతో స్కైరూట్ ఎరోస్పేస్ చేపట్టిన ఈ తొలి మిషన్‌ను ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ మంగళవారం నాడు ప్రారంభించారు. ఈ మిషన్‌తో అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారత ప్రైవేట్ స్పేస్ కంపెనీగా స్కైరూట్ ఎరోస్పేస్ రికార్డులకెక్కనుంది. 2020లో భారత అంతరిక్ష శాస్త్ర, పరిశోధనా రంగంలోకి ప్రైవేట్ సంస్థలను కూడా అనుమతించిన సంగతి తెలిసిందే. 'విక్రమ్-ఎస్ రాకెట్ అనేది ఒక సింగిల్ స్టేజ్ సబ్-ఆర్బిటాల్ లాంచ్ వెహికల్. ఇది మూడు కస్టమర్ పేలోడ్‌లను తీసుకువెళుతుంది. అలాగే విక్రమ్ సిరీస్‌లోని స్పేస్ లాంచ్ వెహికల్స్‌లోని సాంకేతికతలను పరీక్షించడానికి, ధృవీకరించడానికి సహాయపడుతుంది' అని స్కైరూట్ఎరోస్పేస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నాగ భరత్ డక ఒక ప్రకటనలో తెలిపారు.

పరస్పర ప్రయోజనాలతో పటిష్ట బంధం

- రష్యా విదేశాంగ మంత్రితో జై శంకర్ భేటీ

మాస్కో : పరిష్కరించాల్సిన పలు సవాళ్ళు మన ముందున్నాయని భారత విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ వ్యాఖ్యానించారు. రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్‌తో మంగళవారం భేటీ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు చర్చలు జరిపారు. మొత్తంగా అంతర్జాతీయ పరిస్థితులపై, నిర్దిష్టమైన ప్రాంతీయ ఆందోళనలపై మన చర్చలు జరుగుతాయని సమావేశం ప్రారంభానికి ముందు జై శంకర్ పేర్కొన్నారు. తీవ్రవాదం, వాతావరణ మార్పులు వంటి ప్రమాదకరమైన సమస్యలు మన ముందున్నాయని, ప్రగతి, సంక్షేమంపై ఇవి చాలా ప్రతికూల ప్రభావాన్ని కనబరుస్తున్నాయని అన్నారు. ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య వివిధ స్థాయిల్లో పటిష్టమైన, నిరంతర సంబంధాలు వున్నాయని పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను సమీక్షించేందుకు, అంతర్జాతీయ పరిస్థితులపై పరస్పరం అభిప్రాయాలు పంచుకునేందుకు ఈ సమావేశం దోహదం చేస్తుందన్నారు.

కార్పొరేట్ నిధుల వరద

(మొదటి పేజీ తరువాయి)

వీలులేదు. దీంతో వాటిని సవరిస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సవరణ ప్రకారం ఈ నెల 9వ తేదినుండి 15 వ తేది వరకు ఎలక్టోరల్ బాండ్లను విక్రయించవచ్చు. ఈ బాండ్లను కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేసి రాజకీయ పార్టీలకు విరాళంగా ఇయ్యవచ్చు. 2020-21 సంవత్సరంలో ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో వచ్చిన నిధులలో 75 శాతం బిజెపికే అందాయి. మరోవైపు ఈ ఏడాది జులైలో 389.50 కోట్ల రూపాయల విలువైన ఎలక్టొరల్ బాండ్ల విక్రయం జరగ్గా, అక్టోబర్‌లో 10,246 కోట్ల రూపాయల బాండ్లను కార్పొరేట్ సంస్థలు కొనుగోలు చేశాయి.



మీకోసం

దోరగా వేయించిన వాముని పలుచటి వస్త్రంలో మూటకట్టి పిల్లల ఛాతీపై మృదువుగా కాపడం పెడితే ఆయాసం తగ్గి, ఊపిరి తేలికగా తీసుకోగలుగుతారు.

జీవన సౌరభం

స్వీకరించిన ఆదర్శాన్ని ఆచరించే ప్రయత్నంలో వేయిసార్లు విఫలమైనా మరొకసారి ప్రయత్నించండి.



పట్నం చూసొద్దాం

బుర్రు బుర్రు బస్సు ఎక్కేద్దాం
చలాకిదనంగా వెళ్ళొద్దాం
పట్నం చూసి తిరిగొద్దాం
చక్కని బొమ్మలు కొనేద్దాం

సర్కస్ ఆట తిలకించుదాం
చక్రంలో గిరగిరా తిరిగేద్దాం
నచ్చినవన్నీ తిరగేద్దాం
ఎంచక్కా మనం తిరిగొద్దాం

అంగడి దగ్గరకెళ్దాం
తినుబండారాలు కొనేద్దాం
నోటిని రుచిగా చేసుకుందాం
కడుపు నిండా ఆరగించుదాం

చలనచిత్రమే చూసొద్దాం
కథలో నీతిని కనుగొందాం
కొత్త స్నేహాన్ని పలకరిద్దాం
ఆహ్లాదంగా గడిపేద్దాం

పుస్తకాల షాపుకు వెళ్దాం
అవసరమైనవి కొనుకుందాం
పెన్సిల్ పేనా తీసుకుందాం
బ్యాగులో చక్కగా సర్దుకుందాం

పెద్ద పెద్ద మేడలు చూద్దాం
రింగుల దారిలో నడిచొద్దాం
చుట్టూ ప్రకృతి తిలకిద్దాం
జ్ఞాపకాలను నెమరు వేద్దాం


పట్నం సంగతి తెలుసుకుందాం
తోటి పిల్లలతో చెప్పుకుందాం
తెచ్చిన చిరుతిళ్ళు పంచుకుందాం
అందరు కలిసి ఆనందిద్దాం

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636

సరైన నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ చిన్న పిట్ట ఉంది. దాని పక్కనే కొన్ని నీడలు ఉన్నాయి. వాటిలో దీని సరైన నీడను కనిపెట్టండి.

జవాబు: 3



నేను గీసిన బొమ్మ



- కె. ప్రసన్న,
10వ తరగతి,
జడ్పీ స్కూల్, రాయిలాపూర్
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కథ చెబుతారా.. ఊ కొడతాం...

అమ్మా.. నాన్న.. మేం పుట్టక ముందు మా కోసం కలలు కన్నారు. పుట్టాక మా భవిష్యత్తు కోసం ఉరుకులు పరుగులు పెడుతున్నారు. తీరికలేని మీరు మాతో కలిసి కబుర్లు చెప్పిందెప్పుడు? ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్దరోయే వరకు మీకు మళ్లే మమ్మల్ని కూడా స్కూలు, ట్యూషను అంటూ చదువు పరుగులు పెట్టిస్తున్నారు. మాకు కావాల్సినవన్నీ సమకూరుస్తున్నామని తృప్తి పడుతున్నారు. అడగకుండానే అన్నీ తెచ్చిస్తున్నారు. కాని ఏదో వెలితి.. మా ఆటలు, పాటలు అన్నీ యాంత్రికంగా అలా అలా సాగిపోతున్నాయి. విరామం కోసం విహారం అంటారు.. వినోదం కోసం సినిమా అంటారు. పండగొస్తేనే అమ్మమ్మ ఇంటికి.. వేసవికే నానమ్మ ఊరు..
ప్చ్ చాలా బోర్ కొడుతోంది..



నేనూ, చెల్లీ కలిసి ఆడుకున్నదానికంటే కొట్టుకున్నదే ఎక్కువ. చెల్లంటే నాకిష్టమే.. కాని ఎందుకో దాంతో ప్రేమగా ఉండలేకపోతున్నాను. ఇంటికెవరైనా బంధువులొస్తే వాళ్లెప్పుడు వెళ్లిపోతారా అని ఎదురుచూస్తున్నాను. వాళ్లొస్తే ఎందుకు ఇబ్బంది పడుతున్నానో అర్థం కావడం లేదు. రోజూ స్కూలుకి వెళ్లబుద్ధి కావడం లేదు. ఫ్రెండ్స్‌తో ఆడుకోవాలంటే నాదే పైచేయి ఉండాలనుకుంటున్నాను. నా మాట వినకపోతే కొట్టాలనిపిస్తోంది. చేతిలో ఏది ఉంటే అది విసిరేయాలనిపిస్తోంది. ఇంటి దగ్గర ఇలా వుండే నేను స్కూలుకు వెళితే ఎందుకో నిశ్శబ్దంగా ఉండిపోతున్నాను. టీచరు ముందు ధైర్యంగా మాట్లాడలేకపోతున్నాను. రోడ్డు మీద ఎవరైనా చినిగిన బట్టలు వేసుకుని తిరుగుతూ అడుక్కుంటూ కనపడితే చిరాకుగా ఉంటోంది. నేనిలా ఉంటే చెల్లేమో ఒక్కత్తే ఆడుకోదు. అడిగితే భయమంటుంది. నా మీదకైతే ఒంటికాలు మీద వచ్చే చెల్లి బయటికెళ్లదెందుకో? స్కూలుకెళ్లాలంటే ఇంటి ముందుకొచ్చే ఆటో, బస్సు ఎక్కించేస్తారు. బిజీ రోడ్డులో అదే పనిగా హారన్ కొట్టుకుంటూ వెళ్లే వాహనాలను చూస్తుంటే ఏదో గుబులుగా ఉంటోంది. చీకటి పడుతుంటే చాలు అమ్మ పక్కనే ఉన్నా భయమేస్తోంది. ఈ భయాలు, బిడియాలు, అహంకారం, హింస నా నుంచి ఎలా పోతాయి?



నాలాగే పిల్లలందరికీ ఇలాగే ఉంటుందా? ఉండొచ్చు. ఉండకపోవచ్చు.. ఇవన్నీ మేం ఎవరితో పంచుకోవాలి? నేను పెద్ద క్లాసులకు వెళితే టీచర్లు మంచి మంచి విషయాలు నేర్పుతారని, పెద్దలతో ఎలా మెలగాలో.. చిన్నవాళ్లను ఎలా ప్రేమించాలో చెబుతారని అమ్మ చాలాసార్లు చెప్పింది. నాన్న నువ్వేమో.. నేను పెద్దాయ్యాక ఎలా ఉండాలో.. ఏం చేయాలో ఎప్పుడూ చెబుతుంటావు. నీతి కథలు వినమని, చదవమని అమ్మమ్మ అంటుంది. మీ చిన్నప్పుడు బోలెడన్ని కథల పుస్తకాలు ఉండేవని మీరు వాటిని చాలా బాగా చదివేవారని నానమ్మ చెప్పింది. అటక మీద నుంచి వాటిని తీసి బూజు దులిపి మరీ మా చేత చదివించింది. కానీ నాన్న.. అందులో ఒక్కటంటే ఒక్కటి కూడా మా తలకెక్కలేదు.

అందుకే పుస్తకాల్లో కథలకంటే ముందు మాకు మీ గురించి చెప్పండి.. మీ చిన్నప్పుడు మీ అమ్మమ్మ, నానమ్మలతో మీరెలా ఉండేవారో చెప్పండి. తాతయ్య ఇచ్చిన చిల్లర డబ్బులు ఎంత భద్రంగా దాచుకునేవాడివో నువ్వు చెప్పు నాన్న. మీ అమ్మమ్మ నీ కోసం కుట్టించిన బుట్ట గౌను నీకెంత ఇష్టమో నువ్వు చెప్పమ్మా. స్కూలుకెళ్లేటప్పుడు నువ్వు నడిచిన మైళ్లదూరమెంతో, దారిలో నువ్వెక్కిన చెట్టూచేమ, ఆప్యాయంగా పలకరించే ఊరూవాడా గురించి చెప్పు నాన్న. మీ చిన్నప్పుడు అత్తలు, బాబాయిలు, పెద్దమ్మలు, మావయ్యలతో మీరు పంచుకున్న ఊసులు చెప్పండి. పండగప్పుడు మీ అమ్మమ్మ చేసిన పిండివంటలు, నానమ్మ కొనిచ్చిన కొత్తలాగు కబుర్లు మాకూ చెప్పండి. మీ మామయ్యను ముప్పుతిప్పలు పెట్టేలా మీరు చేసిన అల్లరి, అత్తయ్యను ఆటపట్టించేలా గుప్పించిన ప్రశ్నల వర్షం, రోజంతా ఎలా సరదా సరదాగా గడిచిపోయేదో వివరించండి. మీరు బడికి వెళ్లనని మారాం చేస్తుంటే తాతయ్య నిన్ను భుజాలపై ఎక్కించుకుని ఎలా తీసుకెళ్లేవారో.. స్కూలుపై భయం పోయేలా మీతో ఏమేం చెప్పారో.. ధైర్యంగా ఎలా ఉండమన్నారో.. మాకూ చెప్పండి. మీరు నడిచొచ్చిన దారిలోకి మమ్మల్నీ తీసుకెళ్లండి.. మా భవిష్యత్తు అక్కడే ఉంది. కాంక్రీటు గోడల మధ్య, కొనితెచ్చుకున్న పలకరింపులతో యాంత్రికంగా బతుకుతున్న మీరు ఒక్కసారి మీ బాల్యంలోకి తొంగిచూడండి. ఆ మధుర స్మృతులు మాతో పంచుకోండి. మీ అనుభవ పాఠాలే మా జ్ఞానదీపికలు.. చదువుపై ఆసక్తి, పెద్దలపై గౌరవమే కాదు కష్టం గురించి, దాని విలువ గురించి, బంధాలు, విలువలు, ఆప్యాయతలతో ఎలా మెలగాలో నేర్చుకుంటాం. ధైర్యంగా నిలబడడం, సమస్య నుంచి దూరంగా పారిపోకుండా మమ్మల్ని మేం శక్తిమంతులుగా తీర్చిదిద్దుకుంటాం. మా వర్తమానం, భవిష్యత్తు చక్కదిద్దుకునేలా మీ కుటుంబం, మనుషులు, కష్టాలు, సుఖాలనే పాఠాలుగా చెప్పండి. వాటి నుంచి ఎన్నో నేర్చుకుంటాం. మా భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుంటాం. అందుకే ఓ అమ్మా.. నాన్న.. మీ కథలు చెప్పండి.. ఊ కొడతాం..





- జ్యోతిర్మయి

బాలల ప్రత్యేకం

నవంబరు 14 బాలల దినోత్సవం. ఈ సందర్భంగా ఈరోజు నుంచి ఆరు రోజుల పాటు జీవనలో పిల్లలకు సంబంధించిన వివిధ అంశాలపై కథనాలు ప్రచురిస్తున్నాం.

- ఎడిటర్

నేను చావట్లేదు : సమంత



సమంత నటించిన 'యశోద' చిత్రం విడుదలకు సిద్ధమవుతున్న వేళ ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఇటువంటి సమయంలో ధైర్యంగా పోరాడాలని తన స్నేహితులు చెప్పిన మాటల్ని స్ఫూర్తిగా తీసుకుని.. ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నట్లుగా ప్రకటించారు. ఆమెకు వచ్చిన వ్యాధి ప్రాణాంతకమైందని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై ఈ సందర్భంగా మాట్లాడారు. 'నా పోస్ట్‌లో చెప్పినట్లుగా.. మనకి అన్ని రోజులూ ఒకేలా ఉండవు. ఒకరోజు ఒకలా.. మరొక రోజు మరోలా ఉంటుంది. నాకు ఒక్కో రోజు.. ఇంకొక్క అడుగు కూడా ముందుకు వేయలేనేమో అనిపిస్తుంది. (కన్నీళ్లు పెట్టుకుంటూ..) కానీ ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే.. ఇంత దూరం వచ్చానా? అనిపిస్తుంది. కానీ యుద్ధం చేయాలి. నేనొక్కదానినే కాదు.. బయట ఎంతో మంది జీవితం కోసం యుద్ధం చేస్తున్నారు. చివరికి కచ్చితంగా విజయం సాధిస్తాం. నేను చాలా ఆర్టికల్స్ చూశాను.. నాకున్న వ్యాధి చాలా ప్రాణాంతకరమైన వ్యాధి అని రాశారు. కానీ ప్రస్తుతం నేనున్న స్టేజ్‌లో అది ప్రాణాంతకమైనది మాత్రం కాదు. ప్రస్తుతానికైతే నేను చావలేదు. అటువంటి హెడ్‌లైన్స్ పెట్టాల్సిన అవసరం లేదు. కానీ ఇబ్బంది మాత్రం ఉంది.. నేను ఇంకా ఫైట్ చేస్తూనే ఉన్నా.. పూర్తిగా కోలుకోవడానికి ఇంకాస్త టైమ్ పడుతుంది. ప్రస్తుతానికైతే నేను చావట్లేదు...' అని కన్నీటి పర్యంతమౌతూ చెప్పారు.



సినిమాలో మీ జోక్యం వద్దు
తమ్మారెడ్డి

టాలీవుడ్ సీనియర్ నటుడు అర్జున్ సర్జా తెరకెక్కిస్తున్న ఓ సినిమా నుంచి విశ్వక్ సేన్‌ను వైదొలగిన సంగతి తెలిసిందే. ఈ వివాదంపై తాజాగా దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. 'ఈ మధ్య కాలంలో చాలామంది హీరోలు ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటున్నారు. ఈ ఇన్వాల్వ్‌మెంట్ కారణంగానే ఎక్కువ సినిమాలు ఫ్లాప్ అవుతున్నాయి. ఒక్కో ప్రొడ్యూసర్ ఒక్కో డైరెక్టర్‌ను తీసుకొస్తారు. ఆ డైరెక్టర్ ఒక కథను తీసుకొచ్చి దానికి న్యాయం చేయాలని చూస్తాడు. వివిధ నిర్మాతలు వివిధ దర్శకులు వల్ల వివిధ రకాల కథలు వస్తాయి.. విభిన్నమైన సినిమాలు వస్తాయి. కానీ హీరోలు ఇన్వాల్వ్ అవ్వడం వల్ల సినిమాలన్నీ ఒకేరకంగా ఉంటున్నాయనేది నా ఉద్దేశం. అన్నిట్లో జోక్యం చేసుకోవడం వల్ల పాటలు, మాటలు, ఆటలు అన్నీ ఒకేలా ఉంటున్నాయి.. చూడటానికి ఒకేలా ఉంటున్నాయి కాబట్టే ఆడటం లేదని నేను అనుకుంటున్నాను. ప్రొడ్యూసర్‌ని డైరెక్టర్‌ని డిస్టర్బ్ చేయకండి. ప్రతీది మీరే చెప్తే అన్నీ ఒకేలా ఉంటాయి. అప్పుడు మీకే ఇబ్బంది అవుతుంది'.

బాలీవుడ్‌లో మరోసారి ఐశ్వర్య రాజేష్



నిర్మాణ సంస్థలు ఎండేమోల్ షైన్ ఇండియా నట్మెగ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా సైకలాజికల్ థ్రిల్లర్ జోనర్‌లో ఓ చిత్రం రూపొందించనున్నారు. 'మాణిక్' అనే టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రంలో ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఇంకా సంయుక్త షణ్ముగ నాథన్, వివేక్ ప్రసన్న సాయ్, జనని స్వర కాంబ్లే కీలకపాత్రల్లో నటిస్తున్నారు. తమిళంతో పాటు హిందీలోనూ ఈ సినిమా తెరకెక్కిస్తున్నారు. గతంలో 2017లో ఐశ్వర్య రాజేష్ బాలీవుడ్ చిత్రంలో నటించారు. ఇప్పుడు మరోసారి బాలీవుడ్ తెరపై కనిపించనున్నారు. సామ్రాట్ చక్రవర్తి ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు.

18న 'మిస్టర్ మమ్మీ'



నటుడు రితీష్ దేశ్‌ముఖ్, జెనీలియా దేశ్‌ముఖ్ నటించిన చిత్రం 'మిస్టర్ మమ్మీ'. షాద్ అలీ దర్శకత్వం వహించిన కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రాన్ని టి-సిరీస్ నిర్మిస్తుంది. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 18న విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ విషయం తెలుపుతూ రితీష్ బేబీ బంప్ పోస్టర్ ఒకటి విడుదల చేసింది. ప్రెగ్నెన్సీ సమయంలో భార్యాభర్తల మధ్య భావోద్వేగాలు, సంఘటనలను కామెడీతో జోడించి తీసిన ఈ చిత్రం ప్రతి ఒక్కర్నీ కడుపుబ్బా నవ్విస్తుందని బృందం తెలిపింది. దీంతో జెనీలియా, రితీష్ అభిమానులు 'నవ్వడానికి సిద్ధంగా ఉన్నాం' అంటూ సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు.

'ఇండియన్ లాక్‌డౌన్' టీజర్ విడుదల



కరోనా నాటి పరిస్థితులను ప్రతిబింబిచేలా వస్తున్న చిత్రం 'ఇండియన్ లాక్‌డౌన్'. మధుర్ భండార్కర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. లాక్‌డౌన్ సమయంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడ్డారు, వలస కూలీలు అనుభవించిన వేదన, వేశ్యవృత్తి వారిపై కరోనా ప్రనభావం లాంటి ఎన్నో ఆసక్తికర విషయాలను ట్రైలర్‌లో చూపించారు. శ్వేత బసు ప్రసాద్, ప్రతీక్ బబ్బర్, సాయి తమంకర్, ప్రకాశ్ బెలవాడి, అహన్‌కుమ్రాలు కీలకపాత్రల్లో నటించారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఓటీటీ జీ5 వేదికగా డిసెంబరు 2న స్ట్రీమింగ్ కానుంది.

ప్రపంచకప్ సెమీస్‌లలో
కివీస్‌పై పాక్‌దే పైచేయి..

ఫైనల్ బెర్త్ ఎవరికో..!
నేడు టి20 ప్రపంచకప్ తొలి సెమీఫైనల్



మ. 1.30గం॥ల నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

(ప్రజాశక్తి స్పోర్ట్స్ డెస్క్)
వైట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీ చరిత్రలో పాకిస్తాన్ జట్టు సెమీస్‌లో న్యూజిలాండ్ చేతిలో ఓటమిపాలైన దాఖలాల్లేవు. 1992, 1999లలో జరిగిన ఐసిసి వన్డే ప్రపంచకప్‌తోపాటు 2007 ఆరంభ టి20 ప్రపంచకప్ సెమీస్‌లోనూ పాక్ జట్టు న్యూజిలాండ్‌పై విజయాల్ని నమోదు చేసుకుంది. ఇప్పటివరకు మూడుసార్లు న్యూజిలాండ్‌తో తలపడి పాక్ జట్టు మూడింట్లోనూ పైచేయి సాధించింది. ఇదే రికార్డును నేడు న్యూజిలాండ్‌తో జరిగే టి20 ప్రపంచకప్‌లోనూ పునరావృతం చేయాలని చూస్తోంది. ఇరుజట్ల మధ్య జరిగిన ఐసిసి వన్డే, టి20 ప్రపంచకప్ సెమీస్ ఫలితాల రికార్డును ఓసారి పరిశీలిద్దాం..

1992 వన్డే ప్రపంచకప్: ఆస్ట్రేలియా-న్యూజిలాండ్ ఆతిథ్యమిచ్చిన 1992 వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్లో పాకిస్తాన్ జట్టు న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించింది. అక్లాండ్ వేదికగా గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై 7వికెట్ల తేడాతో నెగ్గిన పాక్ జట్టు సెమీస్‌లో మరో దఫా కివీస్ జట్టును 4వికెట్ల తేడాతో ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లి టైటిల్‌ను గెలిచింది. యువ క్రికెటర్ ఇంజమామ్-ఉల్-హక్ ఆ టోర్నీలో అద్భుత ఇన్నింగ్‌లతో ఆకట్టుకొని పాక్ జట్టు ప్రపంచకప్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. న్యూజిలాండ్‌పై సెమీస్‌లో ఇంజమామ్ కేవలం 37బంతుల్లో 60 చేయడంతోపాటు ఫైనల్లో ఇంగ్లండ్‌పై 35బంతుల్లో 42పరుగులు చేసి ఆ జట్టు టైటిల్ చేజిక్కించుకోవడానికి దోహదపడ్డాడు.

1999 వన్డే ప్రపంచకప్: ఇంగ్లండ్ వేదికగా 1999లో జరిగిన వన్డే ప్రపంచకప్ సెమీస్‌లోనూ పాక్ జట్టు న్యూజిలాండ్‌ను చిత్తుచేసింది. పాక్ ఎడమచేతి వాటం ఓపెనర్ సయీద్ అన్వర్ అద్భుత ఇన్నింగ్స్‌తో రాణించడంతో ఆ జట్టు రెండోసారి ఐసిసి ప్రపంచకప్ ఫైనల్‌కు చేరడంలో కీలకపాత్ర పోషించాడు. షోయబ్ అక్తర్ నిప్పులు చెరిగే బంతులు విసరడంతో కివీస్ జట్టు 50 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 241పరుగులే చేయగల్గింది. షోయబ్ కీలక మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం ఓపెనర్ అన్వర్(113) సెంచరీకి తోడు వజహతుల్లా వాస్తి(84) బ్యాటింగ్‌లో రాణించడంతో పాక్ జట్టు 9వికెట్ల తేడాతో కివీస్‌ను చిత్తుచేసి ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి రన్నరప్‌తోనే సరిపుచ్చుకుంది.

2007 టి20 ప్రపంచకప్: దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన 2007 ఆరంభ టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లో పాక్ జట్టు మరో దఫా న్యూజిలాండ్‌పై పైచేయి సాధించింది. యార్కర్ స్పెషలిస్ట్ ఉమ్రాన్ గుల్(3/15)నిప్పులు చెరిగే బంతులు విసరడంతో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 143పరుగులే చేయగల్గింది. అనంతరం ఇమ్రాన్ నజీర్(59) చెలరేడంతో పాకిస్తాన్ మరో 7బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్లోకి దూసుకెళ్లింది. కానీ ఫైనల్లో భారత్ చేతిలో ఓడి రన్నరప్‌కే పరిమితమైంది.

ప్రాక్టీస్‌లో గాయపడ్డ రోహిత్..?



ఆడిలైడ్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య గురువారం టి20 ప్రపంచకప్ రెండో సెమీఫైనల్ జరగనుండగా.. ఇరుజట్లకు ఆటగాళ్ల గాయాల బెడద వేధిస్తోంది. ఇంగ్లండ్ జట్టు ఓపెనర్ మలన్‌తోపాటు మార్క్ వుడ్ గాయపడ్డట్లు తాజా సమాచారం. ఇదే క్రమంలో మంగళవారం నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడ్డట్లు తెలిసింది. రోహిత్ కుడి చేతికి గాయమైనట్లు సమాచారం. అయితే, గాయం తీవ్రత ఎలాగుందో వివరాలు తెలియాల్సి ఉంది. ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడ్డ వెంటనే రోహిత్ శర్మ బ్యాటింగ్‌ను నిలిపివేసి ఐస్ ప్యాక్‌తో మర్దన చేస్తున్నట్లు సోషల్ మీడియాలో ఫొటోలు వైరల య్యాయి. రోహిత్ గాయంపై బిసిసిఐ ఎలాంటి ప్రకటన చేయలేదు.

టి20 విజేత భారత్
ఏబీ డివిలియర్స్ జోస్యం

టి20 ప్రపంచకప్ టైటిల్‌ను భారత జట్టు గెలుచుకుంటుందని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఏబీ డివిలియర్స్ జోస్యం చెప్పాడు. మెల్‌బోర్న్ స్టేడియంలో 13న జరిగే ఫైనల్లో భారతజట్టు న్యూజిలాండ్‌తో ఫైనల్లో తలపడే అవకాశం ఉందని ట్విట్టర్‌లో తెలిపాడు. 'టీమిండియాలో ప్రతిభా వంతులైన ఆటగాళ్లు చాలామంది ఉన్నారు. విరాట్ కోహ్లి, సూర్యకుమార్ యాదవ్ భీకర ఫామ్‌కి తోడు కేఎల్ రాహుల్, కెప్టెన్ రోహిత్ శర్మ ప్రతిభను ఏమాత్రం తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. కీలక సెమీఫైనల్ మ్యాచ్‌లో రోహిత్ అదరగొడతాడు' అని డివిలియర్స్ పేర్కొన్నాడు. ఈ ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా జట్లు కచ్చితంగా సెమీఫైనల్ చేరతాయనుకున్నా.. నెదర్లాండ్స్ చేతిలో ఓటమి తమజట్టు ఇంటిదారి పట్టేందుకు కారణమైందన్నాడు.

ఆట తీరు మారని టైటాన్స్
బెంగాల్-యుపి మ్యాచ్ టై



పూణే: సీజన్-9 ప్రొ కబడ్డీలో తెలుగు టైటాన్స్ ఆటతీరు మారలేదు. మంగళవారం దబాంగ్ ఢిల్లీ చేతిలో 40-33పాయింట్ల తేడాతో చేజేతులా ఓటమిపాలైంది. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి 5పాయింట్ల ఆధిక్యతలో నిలిచిన టైటాన్స్ రెండో అర్ధభాగంలో చేతులెత్తేసింది. మ్యాచ్ ముగియడానికి ఒక నిమిషాల ముందు 33-36తో వెనుకబడ్డా.. చివర్లో ఒకేసారి నలుగురు ఔటవ్వడం ఫలితంపై ప్రభావం చూపింది. మరో పోటీలో బెంగాల్ వారియర్స్-యుపి యోధా జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్ 41-41పాయింట్లతో టైగా ముగిసింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68